ఈనాడు అమరావతి

మంగళవారం 15 ఆగస్టు 2017 | 20 పేజీలు

వెలుగుపూడి



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి విద్యుత్తు కాంతులతో వెలుగులీనుతున్న వెలగపూడిలోని సచివాలయ భవనాలు

పరీక్షల స్ఫూర్తికి విఘాతం!

బ్లాక్‌బోర్డుపై ప్రశ్నలు.. రాత పుస్తకాల్లో సమాధానాలు

ప్రశ్నాపత్రం.. అడిషనల్ షీట్ల పంపిణీకి మీనమేషాలు

ఈనాడు–అమరావతి

విద్యా సంవత్సరం ఆరంభమయ్యాక ప్రభుత్వం మధ్యలో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టడంతో ఆ ప్రభావం విద్యార్థులపై బాగా పడింది. సిలబస్ నుంచి పరీక్షల నిర్వహణ దాకా ఏదీ సవ్యంగా సాగటం లేదు. ప్రతిదీ అస్తవ్యస్తంగా తయారైంది. ఇప్పటికే ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఫార్మెటివ్-1(ఎఫ్ఏ-1) పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడించాల్సి ఉంది. అటు కృష్ణా, ఇటు గుంటూరు రెండు జిల్లాల్లో కూడా అనేక పాఠశాలల్లో ఇంకా పరీక్షలు పెట్టలేదు. పరీక్షల నిర్వహణ కూడా స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని ఉపాధ్యాయులే పెదవి విరుస్తున్నారు. గత ఏడాది నుంచి సమగ్ర నిరంతర మూల్యాంకన (సీసీఈ) విధానం అమలవుతోంది. ఈ విధానంలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 20 శాతం మార్కులను కలుపుతారు. పాఠశాల స్థాయిలో జరిగే పరీక్ష కూడా చాలా కట్టుదిట్టంగా నిర్వహించాలని చెప్పి చివరకు ప్రశ్నాపత్రాన్ని కూడా పాఠశాల విద్యాశాఖే ముద్రించి పాఠశాలలకు పంపాల్సి ఉంటుంది. ఈపేపర్ల తయారీ, పరీక్షల షెడ్యూల్‌ను విద్యాశాఖ క్యాలెండర్‌ను అనుసరించి రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్టీ) తయారుచేసి పంపుతుంది. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాక ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించింది. విద్యాశాఖ క్యాలెండర్ ప్రకారం అయితే జూలై 25 నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలు నిర్వహించాలి. అయితే ఆ షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరపాలంటే తొలుత ప్రతి ఉపాధ్యాయుడు (మిగతా 19లో)

కేథరిన్ కేక



గుంటూరులో ఓ ప్రైవేటు కార్యక్రమానికి సోమవారం వచ్చిన సినీనటి కేథరిన్ సెల్ఫీ తీసుకుంటూ సందడి చేసిందిలా..

మూఢ విశ్వాసమే పెట్టుబడి

- చిన్న మొత్తం ఇస్తే.. పెద్ద మొత్తం ఇస్తాం..!
- రైస్‌పుల్లింగ్ పేరుతో ఘరానా మోసం
- విజయవాడ నగరంలో ముఠాలు
- బడా వ్యాపారులు, ఒంటరి మహిళలే లక్ష్యం
- కొంతమంది నేతల అండ

ఈనాడు, విజయవాడ

శరీరంపై ఉన్న బంగారాన్ని తీసి మూటకట్టి గంగానదిలో వేసి మూడు మునకలు వేస్తే అది రెట్టింపవుతుందంటూ ఇంద్ర సినిమాలో హాస్యనటులు బ్రహ్మానందం, సుబ్రహ్మణ్యం, ఎమ్మెస్ నారాయణలు ఏవీఎస్ కుటుంబానికి నమ్మబలుకుతారు. వారు చెప్పినట్లే ఏవీఎస్, ఆయన భార్య, కుమారుడు తమ శరీరంపై ఉన్న బంగారాన్ని తీసి నదిలో వేస్తారు. తరువాత తీసి చూస్తే రాళ్లు, ఇనుప ముక్కలు తప్ప ఏమీ మిగలవు. మూఢ విశ్వాసాలతో మోసపోవద్దు అని చెప్పేందుకు ఇదో మచ్చుతునక. ప్రస్తుతం రాజధాని పరిధిలో కూడా అచ్చం ఇలాంటి సంఘటనలే చోటు చేసుకుంటున్నాయి. అమాయక ప్రజల మూఢ విశ్వాసాలే పెట్టుబడిగా అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ₹ లక్షలు గుంజి ఆనక తప్పించుకు తిరుగుతున్నారు. దీనికి కొందరు నాయకులు వత్తాసు పలకడం ఈ సందర్భంగా ప్రస్తావనర్హం.

'మా దగ్గర విలువైన బంగారు నిక్షేపాలు ఉన్నాయి. వాటిని తీయాలంటే పూజలు చేయాల్సి ఉంది. ముందుగా ₹ 50 లక్షలు పెట్టుబడి కావాలి. మీరు ఆ పెట్టుబడి పెడతే మీకు నాలుగు రెట్లు సొమ్ము ఇస్తాం. అంటే ₹ 2 కోట్లు ఇస్తాం. కేవలం వారం రోజులు పూజలు చేయాల్సి ఉంటుంది' 'మా వద్ద బంగారపు (మిగతా 19లో)

రైస్‌పుల్లింగ్ పేరుతో మోసం చేసిన సంఘటనలు గత కొంత కాలంగా వెలుగు చూస్తున్నాయి. ఇటీవల ఒక ప్రముఖ ఆసుపత్రి యజమానిని బెదిరించే ప్రయత్నం చేయగా ఆయన ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగించారు. నగరంలోని బందరు రోడ్డులో ఓ ప్రముఖ ఆసుపత్రి ఉంది. దాని యజమానికి రైస్‌పుల్లింగ్ పేరుతో కొంతమంది ఫోన్ చేసి సొమ్ములు ఇవ్వాలని అడిగారు. దానికి రెట్టింపు ఇస్తామని చెప్పారు. ఆయన సొమ్ములు సమకూర్చుతామని చెప్పి అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు. తమ వద్ద బంగారు గనులు ఉన్నాయని వాటిని వెలికి తీయడానికి పెట్టుబడి కావాలని ఆ ఆసుపత్రి యజమానిని డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించడం కూడా విశేషం. కుటుంబానికి చెడు జరుగుతుందంటూ హెచ్చరికలు చేయడం గమనార్హం.



ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఆక్టోపస్ 4లో

పశ్చిమం.. ఇక సస్యశ్యామలం

చింతలు తీర్చనున్న చింతలపూడి ఎత్తిపోతల

ఈనాడు – విజయవాడ

కృష్ణా డెల్టా రైతులను ఆదుకుంటున్న గోదావరి జలాలు.. మరో ఏడాదిన్నరలో పశ్చిమ ప్రాంతాన్ని కూడా సస్యశ్యామలం చేయనున్నాయి. ఇప్పటికే తీవ్ర సాగు, తాగునీటి కొరతతో అల్లాడుతున్న జిల్లాలోని ఎగువ ప్రాంత చింతలను చింతలపూడి పథకం తీర్చనుంది. ఇప్పటికే పట్టిసీమ ద్వారా డెల్టాకు సాగునీటి ద్వారా భరోసా దక్కింది. పూర్తిగా వర్షాధార ప్రాంతమైన పశ్చిమ కృష్ణాలో దుర్భిక్ష ఛాయలు కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతానికి సాగర్ ఎడమ కాలువ ద్వారా నీరు అందితేనే సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదు. గత పదేళ్లుగా నాగార్జున సాగర్ నుంచి నీరు అరకొరగానే వస్తోంది. అది కూడా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. రబీ కాలం సగం గడిచిన తర్వాత వస్తున్నాయి. దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్ర విభజనతో ఈ సమస్య మరింత తీవ్రమైంది. ఈ నేపథ్యంలో కష్టాలను తీర్చేందుకు ఇప్పటికే పురోగతిలో ఉన్న చింతలపూడి పథకాన్ని జిల్లాకు విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రెండో దశ కింద గోదావరి జలాలను జిల్లాకు తరలించనున్నారు. ఫలితంగా 2.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు. మొత్తం రూ. 4,900 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇప్పటికే మొదటి దశ పనులు రూ. 1,700 కోట్లతో పశ్చిమ గోదావరి జిల్లాలో సాగుతున్నాయి. రెండో దశ కింద (మిగతా 19లో)

EENADU THE WAY CLASSIFIEDS 12, 13 పేజీలలో

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం



120 మొత్తం స్టాళ్లు

రైతుల ఆదాయం రెండింతలే లక్ష్యం

నేటి నుంచి విజయవాడలో నర్సరీ, సేంద్రియ ఎక్స్ పో

మిర్చియార్డు(గుంటూరు), విజయవాడ సిటీ న్యూస్‌టుడే

వర్షాభావ పరిస్థితులు వెంటాడుతుండటంతో రైతులు సరైన అదనులో పంటల సాగు చేయలేకపోతున్నారు. ఫలితంగా కరవు పరిస్థితులు నెలకొంటున్నాయి. వీటి నుంచి కర్షకులను కాపాడేందుకు ప్రభుత్వం ఉద్యాన పంటలను సాగు చేసేలా ప్రోత్సహిస్తోంది. తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని పదేపదే అధికారులు సూచిస్తున్నారు. కూరగాయలు, పూలు, పండ్లు పంటల సాగు వైపు అన్నదాతలను మళ్లించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర విభజన జరిగాక ప్రప్రథమ నర్సరీ, సేంద్రియ ఎక్స్‌పో స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్టు 15న ప్రారంభించి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ ఎక్స్ పో ద్వారా ఉద్యాన రంగంలోని ప్రాసెసింగ్, ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలను ఒకే వేదిక పైకి తీసుకురానున్నారు. రైతులు, రైతు సంఘాలు ఉత్పత్తి చేసిన సేంద్రియ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే అవకాశాలకు ఇది వేదికగా నిలవనుంది.

ప్రదర్శనలో మొత్తం 120 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 42 సేంద్రియ, 17 నర్సరీ విభాగం, 9 నీటి పారుదల విభాగం, మిగిలినవి రైతులు, ప్రభుత్వానికి సంబంధించిన వివిధ శాఖలకు కేటాయించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 106 నర్సరీలు ఉన్నాయి. ఇందులో ప్రైవేటువే అధికం. 20 ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఉండగా 86 ప్రయివేటువి. 24 నర్సరీలు జాతీయ ఉద్యాన బోర్డ్ గుర్తింపు పొందాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్నవి వివిధ జిల్లాల్లో అక్కడ పండించే పంటల ప్రాధాన్యం బట్టి ఏర్పాటు చేశారు. వీటిలో 8 లక్షల వివిధ రకాల మొక్కలను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వం అమలు చేసే పథకంలో గుర్తించి లబ్ధిదారులకు రాయితీపై మొక్కలను పంపిణీ చేస్తారు.

ఎవరెవరు పాలు పంచుకుంటారంటే..

ప్రభుత్వం సీఐఐ, ఐసీసీఓఏ సౌజన్యంతో విజయవాడలోని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ ప్రాంగణంలో సేంద్రియ, నర్సరీ ఎక్స్‌పో నాలుగు రోజులు పాటు నిర్వహించనుంది. సేంద్రియ ఉత్పత్తులకు సంబంధించిన రైతులు, రైతు ఉత్పత్తిదారులు, వ్యాపారులు, ఎగుమతిదారులు, ప్రభుత్వ సంస్థలు, సేంద్రియ ఉత్పత్తి సంస్థలు పాలు పంచుకుంటాయి. వారు ఉత్పత్తి చేసే సేంద్రియ ఆహార, ఆహారేతర ఉత్పత్తులను ప్రదర్శించడమే గాకుండా అందజేసే వివరాలను తెలియజేస్తారు. ఈ పద్ధతుల్లో పండించిన పండ్లు, కూరగాయలు, ఆహార శుద్ధి పదార్థాలు, తేనె తదితరాలను ప్రదర్శించడమే గాకుండా విక్రయించుకునే అవకాశం కల్పిస్తున్నారు. నర్సరీ విభాగంలో దేశంలోనే పేరెన్నిక గన్న కడియం పూల నర్సరీలు, పండ్ల తోట నర్సరీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పూలు, పండ్ల మొక్కలు ప్రదర్శనలో ఉంచుతున్నందున రాజధాని నగరరాలైన విజయవాడ, గుంటూరు ప్రాంతాల పూల ప్రేమికులు తమకు నచ్చిన మొక్కలను ఎంచుకునేందుకు ఇదో మంచి అవకాశం.



నర్సరీల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ

హైటెక్ నర్సరీ నాలుగు హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసేందుకు రూ.25 లక్షలు యూనిట్ ధరగా నిర్ణయించారు. ఇందులో ప్రభుత్వ సంస్థలకు 100 శాతం, ప్రైవేట్ లబ్ధిదారులకు 40 శాతం రాయితీ ఎంఐడీహెచ్ పథకం ద్వారా కల్పిస్తారు. చిన్న నర్సరీలు 1 హెక్టారు విస్తీర్ణంలో ఏర్పాటు చేసే వాటికి యూనిట్ ధర రూ.15 లక్షలు నిర్ణయించారు. ప్రభుత్వ సంస్థలకు 100 శాతం, ప్రైవేట్ లబ్ధిదారులకు 40 శాతం రాయితీ కల్పిస్తారు. 2022 సంవత్సరం లోగా రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయాలన్న లక్ష్యంతో ఉద్యాన శాఖ అడుగులు వేస్తుంది. సేంద్రియ వ్యవసాయం, ఆహార శుద్ధి, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం పేరున రాష్ట్ర స్థాయి ఎక్స్‌పో అవగాహన సదస్సు 17న నిర్వహించనున్నారు.

అధిక ఆదాయం చేకూరాలనే

– చిరంజీవి చౌదరి, ఉద్యానశాఖ కమిషనర్



తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం రైతులకు చేకూరాలంటే ఉద్యాన పంటల సాగు ద్వారానే సాధ్యపడుతుంది. అందుకే ఏ ఏడాదికి ఆ ఏడాది ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచుకుంటూ ముందుకు సాగుతున్నాం. రాష్ట్ర విభజన జరిగాక మొట్టమొదటి ఎక్స్‌పో నిర్వహిస్తున్నాం. రసాయనాలు, పురుగుమందులు వాడకుండా పంటలు పండించడం, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఉత్పత్తిదారులు, ఎగుమతిదారులను ఒకే వేదిక పైకి తీసుకువచ్చి ఒకరితో ఒకరికి అవగాహన ఒప్పందాలు చేసుకునేలా ప్రోత్సహిస్తాం.

చురుగ్గా ఏర్పాట్లు



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన నర్సరీలు



ప్రత్యేక స్టాళ్లు



ఆకట్టు కుంటున్న పెద్ద అరటి గెల

సమాజంలో మార్పు తీసుకొచ్చేది రచయితలే

ముగిసిన ఈశాన్య, దక్షిణ రచయితల సమాగమం

ఆకట్టుకున్న కథాపఠనం

గవర్నర్‌పేట (విజయవాడ), న్యూస్‌టుడే: సాహిత్యాన్ని రచయితలు మార్పిడి చేసుకోవాలని ఈశాన్య, దక్షిణ రచయితల సమాగమం తీర్మానించింది. కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో రెండు రోజులుగా జరుగుతున్న 'ఈశాన్య, దక్షిణ రచయితల సమాగమం' సోమవారం సాయంత్రంతో ముగిసింది. ఈ సమావేశానికి ఈశాన్య భారతదేశానికి చెందిన ఏడు రాష్ట్రాలు, దక్షిణ భారతదేశానికి చెందిన ఆరు రాష్ట్రాల రచయితలు పాల్గొన్నారు. రెండు రోజులుగా జరిగిన ఈ సమావేశంలో రచయితలు పలు అంశాలపై చర్చించారు. సాహిత్యం సమాజానికి ఎంత అవసరమనే విషయంపై పలువురు రచయితలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమాజంలో మార్పు తీసుకువచ్చే సత్తా రచయితలకు మాత్రమే ఉందని పలువురు రచయితలు పేర్కొన్నారు. కెహెచ్ కుంజో సింగ్ అధ్యక్షతన జరిగిన సమకాలీన సాహిత్య ధోరణులు అంశంపై మృదుల్ బోర్డోలాయ్ (అస్సామీ), కృష్ణ మానవల్లి (కన్నడ), సావిత్రి రాజీవన్ (మళయాళం), ఎన్.నాగమల్లేశ్వరరావు చర్చించారు.

ఆకట్టుకున్న కథానిక పఠనం.. రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు కథానిక పఠనం నిర్వహించారు. శివానంద కకోటి (అస్సామీ), హలెమనె రాజశేఖర్ (కన్నడ), ఎం.కందేష్ సింగ్ (మణిపురి), పి.సత్యవతి (తెలుగు) తదితర రచయితలు తమ కథలను చదివి వినిపించారు. కథల్లో వస్తున్న మార్పులను వివరించారు. అనంతరం కె.ఇనాక్ అధ్యక్షతన కవి సమాగమం ముగింపు జరిగింది. కార్యక్రమంలో ఈశాన్య, దక్షిణ రాష్ట్రాల రచయితలు పలువురు పాల్గొన్నారు.



మణిపురి కథలను వినిపిస్తున్న కందేష్ సింగ్ వేదికపై శివానంద కకోటి, రాజశేఖర్, కందస్వామి, సత్యవతి

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 74, రిటైల్ ధర - 88, చికెన్ విత్ స్కిన్ -123 చికెన్ స్కిన్‌లెస్ - 145
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం ధర - 79, 86, 96, చికెన్ విత్ స్కిన్- 154, చికెన్ స్కిన్‌లెస్- 164

నెక్ కోడిగ్రుడ్ల ధర

★ విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.57 పై॥. నెక్ విజయవాడ ఆఫీస్ Ph: 0866 - 6582559.

రహదారి ప్రమాదాల నివారణకు సర్వే

ఇంజనీరింగ్ విద్యార్థుల సహకారం ★ జాతీయ రహదారుల ప్రత్యక్ష పరిశీలన



సూర్యారావుపేట (విజయవాడ), న్యూస్‌టుడే: కృష్ణా జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. దీనిలో భాగంగా జాతీయ రహదారులపై కూడళ్లు, డివైడర్లు సర్వే చేసి ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ నిబంధనల ప్రకారం ఉన్నాయో లేవో పరిశీలించనున్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి ఆగస్టు 2న రాజమండ్రిలో జరిగిన రోడ్డు సేఫ్టీపై వర్క్‌షాపు జరిగింది. రవాణాశాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ప్రసాదరావు నేతృత్వంలో జరిగిన ఈ వర్క్‌షాపులో ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన రవాణాశాఖ, పోలీసు, జాతీయరహదారులు, రోడ్డుభవనాలశాఖ అధికారులతో పాటు మూడు జిల్లాల ఇంజినీరింగ్ కళాశాలల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపులో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. జిల్లాల వారీగా అధికారులు తీసుకోవాల్సిన కార్యక్రమాల గురించి వర్క్‌షాపులో నిర్ణయం తీసుకున్నారు. ఇందులోభాగంగా ఆగస్టు 16 నుంచి కృష్ణా జిల్లాలో సర్వే ప్రారంభిస్తామని ఉపరవాణా కమిషనర్ ఇ.మీరాప్రసాద్ తెలిపారు.

కృష్ణా జిల్లాలో 16 నుంచి ప్రారంభం

కృష్ణా జిల్లాలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి 16 నుంచి సర్వే చేస్తారు. ఆరు బృందాలను ఏర్పాటు చేయగా ఇందులో పోలీస్, జాతీయ రహదారులు, రవాణాశాఖ, కె.ఎల్. విశ్వవిద్యాలయం, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారు. వీరు 16, 65 నెంబరు జాతీయ రహదారులపై ఉన్న ముఖ్యమైన కూడళ్లు ఇతర అంశాలను పరిశీలిస్తారు. హనుమాన్‌జంక్షన్ నుంచి కనకదుర్గమ్మవారధి వరకు 16వ నెంబరు జాతీయ రహదారి (45 కి.మీ), విజయవాడ నుంచి గరికపాడు వరకు 65వ నెంబరు జాతీయ రహదారి (97 కి.మీ)లు పరిశీలిస్తారు. ఈ మార్గంలో ఉన్న కూడళ్లు, టోల్ గేట్లు, విభాగినులు తదితర అంశాలను పూర్తి స్థాయిలో పరిశీలిస్తారు.

పరిశీలించే అంశాలివి....

- ✦ టోల్‌గేటు ద్వారా రోజుకు వెళ్లే వాహనాల సంఖ్య. ఏ సమయంలో ఎక్కువ వాహనాలు వెళతాయి. ఏయే తేదీల్లో ఎక్కువ వాహనాలను వస్తాయి.
- ✦ జాతీయ రహదారులపై ఉన్న పెట్రోల్ బంకులు సంఖ్య
- ✦ ముఖ్యమైన కూడళ్లు
- ✦ విభాగినుల వివరాలు
- ✦ బ్లాక్ స్పాట్లు, ప్రమాదాల నివారణకు పరిష్కారాలు

ప్రమాదాలు జరిగితే గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తీసుకువెళ్లే మార్గం, వస్తున్న ఇబ్బందులు వాటికి పరిష్కారాలు గుర్తిస్తారు.

ఈ సర్వే వివరాలను ఉన్నతాధికారులకు పంపించనున్నారు. తద్వారా రోడ్డు ప్రమాదాలను పూర్తి స్థాయిలో తగ్గించటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డీటీసీ మీరాప్రసాద్ వెల్లడించారు.

రూ. 10 నాణేలను తిరస్కరిస్తే చర్యలు : కలెక్టర్

విజయవాడ సబ్‌కలెక్టరేట్, న్యూస్‌టుడే: పది రూపాయల నాణెం చెల్లుబాటుపై ఉన్న అపోహలను తొలగించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టరు బి.లక్ష్మీకాంతం సూచించారు. పది నాణాలను తిరస్కరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవిషయమై నగరంలోని తమ విడిది కార్యాలయం నుంచి కలెక్టరు సోమవారం దూరవాణి సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టరు మాట్లాడుతూ పది రూపాయల నాణాలను ప్రజల నుంచి తీసుకునేందుకు వర్తక, వ్యాపార సంస్థలు, చిల్లర దుకాణాల వారు, ఆటో డ్రైవర్లు తదితరాల వారు నిరాకరిస్తున్నట్టు జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చినట్టు తెలిపారు. ఈక్రమంలో బ్యాంకర్లతో చర్చించి ప్రజల నుంచి పది రూపాయల నాణాలను స్వీకరించేలా చూడాలన్నారు. దీనిపై అన్ని బ్యాంకు శాఖలకు ఆదేశాలను జారీ చేసి, నాణాలు చలామణిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకులు, వర్తక, వ్యాపార సంస్థలు, చిల్లర దుకాణాలు, ఆటో డ్రైవర్లు పది రూపాయల నాణాలను తిరస్కరిస్తే స్థానిక తహసిల్దార్లకు ఫిర్యాదు చేయాలని, వాటిని స్వీకరించని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

17న ఫిట్‌మెంట్ సాధనకు మహా ధర్నా

మాచవరం (సీతారాంపురం): రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీజీటీఏ)ఆధ్వర్యంలో ఈ నెల 17న అలంకార్ సెంటర్‌లో ఫిట్‌మెంట్ సాధన కోసం మహా ధర్నా నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ెs. భాస్కరరావు, ఏఆర్ చంద్రశేఖర్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2010, 2013లో జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు డిగ్రీ కళాశాల అధ్యాపకులుగా పదోన్నతి కల్పించారని, పదోన్నతి పొందిన అధ్యాపకులకు యూజీసీ వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఆ రాష్ట్రంలోని అధ్యాపకులకు సీసీఈ ఫిట్‌మెంట్ ఫార్ములాను అమలు చేశారని పేర్కొన్నారు. ఇక్కడ మాత్రం అమలు కాలేదన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 17న మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


మునేరులో గల్లంతైన బాలుడి మృతి



బాలుడి మృతదేహం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మునేరులో ఆదివారం గల్లంతైన బాలుడు మృతి చెందాడు. మృతదేహాన్ని సోమవారం ఉదయం వెలికి తీశారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం రాంచంద్రాపురం గ్రామానికి చెందిన గుర్రపుశాల ఏడుకొండలు కుమారుడు వెంకట కోటేశ్వరరావు (12) ఆదివారం పెనుగంచిప్రోలు వద్ద మునేరులో గల్లంతైన విషయం తెలిసిందే. నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన బాలుడి కోసం ఆదివారం రాత్రంతా వెతికినా ఆచూకీ తెలియలేదు. రామచంద్రాపురం నుంచి వచ్చిన బంధువులు అంతా అక్కడే ఉండి సోమవారం ఉదయం పోలీసులతో కలిసి గాలించారు. బాలుడు నీటిలో పడిపోయిన స్థలం నుంచి సరిగ్గా కిలోమీటరున్నర దూరంలో చెట్ల వద్ద మృతదేహం కనిపించింది. తల్లిదండ్రులు, బంధువులు ఒక్కసారిగా బోరున విలపించారు. బాగా చదువుకుని ప్రయోజకుడవుతాడని భావించిన తల్లిదండ్రులకు గుండె కోతను మిగిల్చాడని కుటుంబ సభ్యులు విలపించారు. ఎస్సై అవినాష్ పంచనామా చేశారు. అనంతరం పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఒత్తిడి తగ్గిద్దాం.. చదువులో ప్రోత్సహిద్దాం!



- ఇల్లు.. తల్లిదండ్రులకు దూరంగా పిల్లలు
- వసతిగృహాల్లో కానరాని కౌన్సిలర్లు
- కళాశాలల్లో కమిటీల ఏర్పాటు జరగాలి

అమరావతి గ్రామీణం, న్యూస్‌టుడే

పల్నాడులోని ఒక పట్టణానికి చెందిన కోటేశ్వరుల కుమారుడు గుంటూరులోని ఓ జూనియర్ కళాశాల వసతిగృహంలో ఉండి చదువుకుంటున్నాడు. వరుసకు సోదరుడి వివాహానికి కళాశాల నుంచి నేరుగా కల్యాణ మండపానికి వచ్చాడు. బంధువులతో ఎంతో సరదాగా గడిపాడు. మరుసటి రోజు ఉదయాన్నే కళాశాలకు వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పాడు. వారు అర్థం చేసుకోకపోగా నువ్వు అసలే చదువులో వెనుకబడి ఉన్నావు.. చదువే ముఖ్యమని బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి కళాశాల వసతి గృహానికి చేర్చారు. ఒత్తిడితో కూడిన చదువును తట్టుకోలేకపోతున్నానని.. మరోవైపు తనను తల్లిదండ్రులు, గురువులు అర్థం చేసుకోవట్లేదని భావించాడు. ఓ లేఖరాసి బలవన్మరణం చెందాడు.

సత్తెనపల్లి సమీప గ్రామానికి చెందిన విద్యార్థిని అతడి తల్లిదండ్రులు పాఠశాల చదువుకు వసతిగృహంలో చేర్చారు. ఏడో తరగతి వరకు సాధారణ విద్యార్థిగా అతడు ఉండేవాడు. బొటాబొటి మార్కులతో ఉత్తీర్ణుడయ్యేవాడు. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు వసతిగృహంలో ఉండి చదువులేకపోయాడు. ఎన్నిసార్లు చెప్పినా ఈ కొన్ని రోజులు ఉంటే నిన్ను ఇంటికి తీసుకెళ్తామని తల్లిదండ్రులు చెప్పేవారు. ఇప్పుడిప్పుడే మీ అబ్బాయి మెరుగవుతున్నాడని ఉపాధ్యాయులు చెప్పేవారు. తీరా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అతడు ఒక తెలుగు పాఠ్యాంశం మినహా మిగిలిన అన్నింట్లోనూ తప్పాడు. అన్ని పాఠ్యాంశాలకు కలిపి అతడికి వచ్చిన మార్కులు కేవలం 76. తల్లిదండ్రులు ఏమంటారోనని భయపడి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి సరైన సమయంలో అప్రమత్తతో అతడి నిండు ప్రాణాల్ని కాపాడారు.

ఒకప్పటి చదువులు తాతయ్య.. నాయనమ్మల నీతి కథలు, వారి స్వాంతన... తల్లిదండ్రుల ఆప్యాయత.. ప్రేమానురాగాలతో ఇంటి చెంతే సాగితే.. ఇప్పుడు నాలుగు గోడలు, కృత్రిమ వాతావరణం, మార్కులు, ర్యాంకులు, ఇష్టంలేని ఆహారం, పరిచయంలేని వందల మంది విద్యార్థులతో సాగుతున్నాయి. ఐఐటీ, ఎంసెట్, నీట్‌లో ర్యాంకులంటూ తల్లిదండ్రులు పిల్లల్ని తీర్చిదిద్దాలని తహతహలాడుతున్నారు. ఇంటి వద్దకంటే వసతిగృహంలో ఉంటేనే బాగా చదువుకుంటాడని వారు భావిస్తున్నారే తప్పించి ఒక్కసారిగా ఆ వాతావరణాన్ని వంటబట్టించుకోగలడా ఒత్తిడిని ఎదుర్కొగలడా అనే విషయాల్ని పట్టించుకోవట్లేదు.

నవ్యనగరి ప్రాంతమే విద్యా హబ్..

నవ్యనగరి ప్రాంతం విద్యా హబ్‌గా ఉంది. విజయవాడ, గుంటూరు నగరాల్లో కళాశాల వసతి గృహాలు సుమారు 520 వరకు ఉండగా పాఠశాల వసతిగృహాలు 350 నుంచి 400 వరకు ఉన్నాయి.

★ **రెండు జిల్లాల్లో భారీగా విద్యార్థులు..** గుంటూరు జిల్లాలో 264 ఇంటర్మీడియెట్ కళాశాలలుంటే విద్యార్థులు రెండేళ్లకు కలిపి 94 వేల మందిగా ఉన్నారు. కృష్ణా జిల్లాలో 310 వరకు కళాశాలలుంటే వాటిలో 1.35 లక్షల మంది చదువుకుంటున్నారు. వీరిలో సుమారు 60 శాతం మంది వరకు చదువులు వసతిగృహాల్లోనే సాగుతున్నాయి. కావాల్సినంత స్వేచ్ఛ.. ముఖ్యంగా ప్రకృతి వాతావరణం. ఇంటితో మమేకమైన పిల్లలు కొత్త వాతావరణంలో గడపలేక ఇంటికి వచ్చేస్తున్నారు. ఇలాంటి వారు 20 నుంచి 25 శాతం మంది ఉన్నారు.

ఆందోళన కలిగించే అంశాలు..

- **రాష్ట్రంలో విద్యార్థుల బలవన్మరణాలు అధికంగా నమోదవుతున్న జిల్లాలు :** కృష్ణా, గుంటూరు ముఖ్యంగా విజయవాడ, గుంటూరు నగరాలు.
- **నెలకు సగటునరాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలు :** 28
- **ఏడాదికి సగటున నవ్యనగరిలో విద్యార్థుల ఆత్మహత్యలు :** 48
- **ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థులు :** 2014లో 333 మంది, 2015లో 360 మంది, 2016లో 372 మంది.

సెక్షన్ల గోల లేకుండా చేయాలి..

ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు మార్కుల ఆధారంగా విద్యార్థుల సెక్షన్లు మార్చుతుండటం వారిని కుంగుబాటుకు గురి చేస్తోందని విద్యార్థుల ఆత్మహత్యలపై నియమించిన ద్విసభ్య కమిటీ ఇంటర్ విద్యామండలికి సమర్పించిన నివేదికలో స్పష్టం చేసింది. పాఠ్యాంశాలపై రోజువారీ, వారానికి ఒకసారి పరీక్షలు నిర్వహించడంతో పాటు వారిపై ఒత్తిడి పెరుగుతోందని నెలకు ఒకసారే అదికూడా పిల్లల్ని ఆందోళనకు గురి చేయని విధంగా పరీక్షలు నిర్వహించాలని సూచనలు చేసింది. ఉదయం 8 గంటల ముందు.. సాయంత్రం 6 గంటల తర్వాత చదువు ఊసే వద్దని కమిటీ పేర్కొంది. నిజంగా దీన్ని పాటిస్తే పిల్లలకు మంచి జరుగుతుంది.

అన్ని కళాశాలల్లో కమిటీలు..

విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడకుండా ఉండేందుకు అన్ని ఇంటర్ కళాశాలల్లో నలుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలని బోర్డు యాజమాన్యాలకు మార్గదర్శకాలు చేసింది. కమిటీలో కళాశాల ప్రిన్సిపల్, ఒక అధ్యాపకుడు, స్థానిక పోలీసు అధికారి, మానసిక వైద్య నిపుణుడు సభ్యులుగా ఉంటారు. అవసరమైతే మరో సభ్యుడిగా మానసిక వికాస నిపుణుడు లేదా విద్యావేత్తను నియమించుకోవచ్చు. రెండు జిల్లాల్లోని అన్ని కళాశాలల్లో ఈ కమిటీల ఏర్పాటు ప్రస్తుతం జరుగుతోంది. జిల్లాస్థాయిలోనూ ఒక కమిటీ ఏర్పాటవ్వనుంది. ప్రతినెలా ఈ కమిటీలు సమావేశమై పిల్లల్లో ఒత్తిడిని దూరంచేసి వారిలో మనోస్థైర్యం నింపేందుకు కృషి చేస్తాయి.

కౌన్సిలర్లు ఉంటే ఒత్తిడి ఉండదు..

నిబంధనల ప్రకారం వసతిగృహాల్లోని విద్యార్థులు మానసిక, శారీరకపరమైన సమస్యలకు లోనవ్వకుండా ఉండేందుకు కౌన్సిలర్లను కళాశాలలు ఏర్పాటు చేయాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కౌన్సిలర్లు ఉండాలి. వీరు ప్రతి విద్యార్థి మానసిక పరిస్థితిని అంచనావేసి వసతిగృహంలో ఉండలేని పరిస్థితి ఉంటే తల్లిదండుల్ని పిలిపించి మాట్లాడి పంపేయాలి. ఇంటి వద్ద నుంచి చదువులు సాగేలా చూసుకునేలా శ్రద్ధ తీసుకోవాలి. కౌన్సెలింగ్ ద్వారా పరివర్తనలో మార్పువచ్చే విద్యార్థులపై వీరు ప్రధానంగా దృష్టి సారించాలి. కానీ ఇక్కడి 90 శాతం వసతిగృహాల్లో కౌన్సిలర్లు లేరు. వార్డెన్లే కౌన్సిలర్ల పాత్రను పోషిస్తున్నారు. తల్లిదండ్రుల ఆలోచనలో పిల్లల వసతిగృహ చదువుల విషయంలో మార్పు రావాలి. చదువుకంటే విజ్ఞానం ఎంతో ముఖ్యం. మన వజ్రాన్ని మనమే సానబెట్టుకోవాలనే విషయాన్ని పెద్దలు గుర్తిస్తే పిల్లల దరికి ఒత్తిడి దరి చేరకుండా ఉండేందుకు ఎన్నో మార్గాలున్నాయి.

'పాప'మని అనుకోలేదు..!



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శిశువు

తోకవారిపాలెం (గ్రామీణ గుంటూరు): తల్లి ఒడిలో నునువెచ్చగా సేద దీరాల్సిన చిట్టి తల్లి.. ముళ్లపాన్పుపై గిజగిజలాడింది. అమ్మకు ఎంత కోపమొచ్చిందో.. పసిపాపను అని చూడకుండా వదిలేసింది. చిన్నారిని గుర్తించిన స్థానికులు అక్కున చేర్చుకున్నారు. అయ్యో పాపకు ఎంత కష్టమొచ్చిందంటూ కన్నీరు కార్చారు. ఈ సంఘటన మండలంలోని తోకవారిపాలెం గ్రామ శివారులో సోమవారం జరిగింది. ముళ్లపొదలో ఏడుస్తున్న నవ జాత శిశువును సోమవారం ఉదయం ఏసోబు అనే వ్యక్తి గుర్తించారు. సమాచారాన్ని 108 సిబ్బందికి అందజేశారు. వారు అక్కడికి చేరుకొని చిట్టిపాపను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం చిన్నారి కోలుకుంటోంది. విషయం తెలిసిన నల్లపాడు సీఐ శ్రీనివాసరావు విచారణకు ఆదేశించారు. ఎస్సై రాంబాబు సంఘటనాస్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. ఎవరో గుర్తు తెలియని మహిళ బిడ్డకు జన్మనిచ్చి, అక్కడే వదిలేసినట్లుగా గుర్తించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఆక్టోపస్

డీజీపీ కార్యాలయంలో జవాన్ల నమూనా ప్రదర్శన



ఉగ్రవాదులపై తుపాకులు ఎక్కుపెట్టిన జవాన్లు


తాడేపల్లి, న్యూస్‌టుడే: నూతనంగా నిర్మించిన రాష్ట్ర డీజీపీ కార్యాలయం వద్ద ఉత్కంఠ నెలకొంది. అక్కడ ఏమి జరుగుతుందోనని ప్రతి ఒక్కరు చూస్తున్నారు. పెద్దపెద్ద తుపాకులతో కార్యాలయం పైనుంచి తాడు సహాయంతో ఆక్టోపస్ జవాన్లు రకరకాల పద్ధతుల్లో కిందికి దిగుతూ పైకి ఎక్కుతూ కనిపించారు. ఇంతలోనే తుపాకీ పేలిన శబ్దాలు... కార్యాలయం గేటు వద్ద నిలిచిన ఒక వ్యక్తిని కాల్చి చంపారు. వెంటనే జవాన్లు ఒకరి వెంట ఒకరు కార్యాలయంలోకి చొరబడి ఒకరిని బంధించారు. ఇదంతా చూస్తే నిజంగానే ఉగ్రవాదులు దాడిచేశారా? అనే సందేహం కలిగింది. ఇది ఆక్టోపస్ నమూనా ప్రదర్శన అని తెలుసుకుని ఊపిరిపీల్చుకున్నారు. డీజీపీ కార్యాలయంపై ఉగ్రవాదులు దాడికి దిగితే వారిని ఎలా తుద ముట్టించాలో జవాన్లు సోమవారం నమూనా ప్రదర్శన (మాక్‌డ్రిల్) ప్రదర్శించారు. ఉగ్రవాదులపై ఎదురు కాల్పులను ఎలా చేయాలి... కార్యాలయం లోపల ఉన్న ఉగ్రవాదులను ఎలా తుద ముట్టించాలి... ఎలాంటి అనుమానం లేకుండా తల్లకిందులుగా తాడు సహాయంతో దిగుతూ కార్యాలయంలోపల ఉన్న వారిని గుర్తించే తీరును చూపారు. మూకుమ్మడిగా జరిగే దాడులను బ్లాక్ కమాండోలు చేసి ప్రదర్శించారు. దాదాపు రెండుగంటల పాటు సాగిన ఆక్టోపస్ మాక్‌డ్రిల్ ఆసక్తిగా ఉత్కంఠగా సాగింది.

ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య దినోత్సవ శుభవేళ... భారతదేశ చరితార్థులు

Esd. Special Feature

ఉప్పెనలా సమరం

స్వాతంత్ర్య సంగ్రామంలో కృష్ణా జిల్లా




"సత్యం ఒక్కటే జీవితాన్ని సన్మార్గంలో తీసుకొని వస్తుంది"
– మహాత్మగాంధీ

హనుమాన్‌జంక్షన్: భారత జాతీయ కాంగ్రెస్ 1885లో స్థాపించే నాటికే కృష్ణా జిల్లాలో తగినంత రాజకీయ, సామాజిక చైతన్యాలు వికసించాయి. అప్పట్లో కృష్ణా జిల్లా అంటే ఇప్పటి పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు కలిపి ఉండేవి. 1904లో గుంటూరు జిల్లా విడిపోయింది. 1925లో పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పడింది. 1970లో గుంటూరు జిల్లా నుంచి ప్రకాశం విడిపోయి ప్రస్తుతమున్న జిల్లా స్వరూపాలు ఏర్పడ్డాయి. 1885 కాంగ్రెస్ ఆవిర్భావ సభలో కృష్ణాజిల్లా నుంచి సింగరాజు వెంకట సుబ్బారాయుడు ప్రతినిధిగా పాల్గొన్నారు. 1891 కాంగ్రెస్ సభలో ఆయనతో పాటు శనగవరపు రామస్వామి పాల్గొన్నారు. అయ్యదేవర కాళేశ్వరరావు, గొల్లపూడి సీతారామశాస్త్రి, గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1905లో విద్యార్థి మహాసభ నిర్వహించి వందేమాతరం ఉద్యమంలో కృష్ణాగళం కలిపారు.



"సమయానికి కొలమానం సంవత్సరాలు గడిచిపోవడం కాదు. కానీ ఆ కాలంలో మనం ఏం చేశాం, ఎలా ఉన్నాం ఏం సాధించమన్నది ముఖ్యం"
– జవహర్‌లాల్ నెహ్రూ



"మనిషి విజ్ఞానం పొందితేనే వికాసవంతుడవుతాడు".
– చంద్రశేఖర్ ఆజాద్



"స్వాతంత్ర్యం నా జన్మసిద్ధ అధికారం, దానిని సాధించేందుకు ఏదైనా చేస్తాను".
– లోకమాన్య బాలగంగాధర్ తిలక్



"దేశం అభివృద్ధి చెందడమంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు, పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి"
– బి.ఆర్. అంబేద్కర్



"నాకు మీ రక్తాన్ని ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను".
– సుభాష్ చంద్ర బోస్



"జీవితాన్ని ప్రేమిస్తాం మరణాన్నీ ప్రేమిస్తాం మేం మరణించి ఎర్రపూల వనంలో పూలై పూస్తాం, ఉరికంబాన్ని ఎగతాళి చేస్తాం, నిప్పురవ్వల మీద నిదురిస్తాం"
– భగత్‌సింగ్



"ఏ ప్రభుత్వమైతే అమాయకులైన ప్రజలపైన దాడి జరుపునో ఆ ప్రభుత్వం నాగరిక ప్రభుత్వం అనబడదు".
– లాలా లజపతిరాయ్



"ఒక దేశం గొప్పదనం దానిలో అంతర్లీనమైన ప్రేమ, త్యాగాల ఆదర్శాలే దాని స్ఫూర్తి".
– సరోజినీ నాయుడు

1906లో ముట్నూరి కృష్ణారావు ఆహ్వానం మేరకు బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర ప్రాంతంలో పర్యటించి ఆయన చేసిన ప్రసంగాలు అప్పటి కృష్ణా తీరంలోస్వాతంత్ర్య కాంక్షను మొలకలెత్తించాయి. 1908లో స్థాపించిన బెజవాడ డివిజినల్ కాంగ్రెస్ కృష్ణా జిల్లా స్వాతంత్ర్యోద్యమానికి గట్టి పునాదులు వేసింది. 1916లో అనిబీసెంటు ఆధ్వర్యంలో జరిగిన హోంరూల్ ఉద్యమంలో బెజవాడ యువత చురుకుగా పాలుపంచుకుంది. అదే సంవత్సరం అనీబీసెంటు బెజవాడలో పర్యటించిన గుర్తుగా బీసెంటురోడ్డుకు నామకరణం జరిగింది. 1919. ఏప్రిల్ 6న అయ్యదేవర కాళేశ్వరరావు నాయకత్వంలో బెజవాడ పౌరులు కృష్ణానదిలో స్నానం చేసి సత్యాగ్రహదీక్షబూనారు. 1920లో మాంటేగు ఛెమ్సుఫర్డు సంస్కరణలకు వ్యతిరేకంగా గాంధీజీ పిలుపు మేరకు గులాం మొహియుద్దీన్ తన మేజిస్ట్రేటు పదవిని త్యజించారు. అయ్యదేవర కాళేశ్వరరావు, గంపలగూడెం కుమారరాజా, కానూరి వెంకట చలపతయ్య శాసనసభకు దాఖలు చేసిన నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.. 1930లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో కృష్ణా జిల్లా చురుకుగా పాలుపంచుకుంది. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో జిల్లాలోని ప్రధానగ్రామాల్లోని పాలుపంచుకున్నాయి. ప్రథమశ్రేణి నాయకులను ప్రారంభంలోనే అరెస్టు చేసినా చివర వరకూ ఉద్యమం ఉప్పెనలా సాగింది.

గన్నవరం

సంస్కారానికి వేదికగా నిలవాలి

హనుమాన్‌జంక్షన్ : విద్యాలయాలు ప్రతిభానైపుణ్యాలకే కాకుండా సంస్కారానికి వేదికలు కావాలని బాపులపాడు సర్పంచి కాకాని అరుణ అన్నారు. స్థానిక సాయిగీతాంజలి జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. విద్యార్థుల ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ జై.. కృష్ణ జై..!

హనుమాన్‌జంక్షన్, గన్నవరం, న్యూస్‌టుడే : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా జంక్షన్, గన్నవరంలోని వివిధ పాఠశాలలు, దేవాలయాల్లో వేడుకలు నిర్వహించారు. గన్నవరం యాదవ రామాలయంలో ఉదయం శ్రీకృష్ణుడికి లక్ష పువ్వులతో పూజచేశారు. మహిళా భక్తుల నామసంకీర్తనతో మధ్యాహ్నం వరకూ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. స్థానిక వేంకటేశ్వరాలయంలో తితిదే ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం గోపూజ, సాయంత్రం ఉట్టి వేడుక ఉత్సాహంగా సాగాయి.

★ జంక్షన్ సిద్ధార్థ, చైతన్య, భారతీ విద్యాభవన్ పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. చిన్న తరగతుల బాలబాలికలు కృష్ణుడు, గోపికల అలంకరణలు చేశారు. ఆటపాటలు, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. సిద్ధార్థ పాఠశాలలో కృష్ణాష్టమి సందర్భంగా 3వ తరగతి ఆపై విద్యార్థులకు నీతికథల పోటీ ఏర్పాటు చేశారు.



ప్రసాదంపాడులో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో...

ప్రసాదంపాడు (విజయవాడ గ్రామీణం), న్యూస్‌టుడే : ప్రసాదంపాడులోని ప్రతిభా పబ్లిక్ పాఠశాలలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు నీలిమా, డైరెక్టర్ విశ్వనాథ్ పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు బాలబాలికలను కృష్ణులు, గోపికల వేషదారణల్లో అలంకరించారు. కృష్ణుడి బాల్య చరిత్ర, గీతాలు ఆలపించారు. ఉట్టి కొట్టించే కార్యక్రమం అందరిని అలరించింది.



జంక్షన్ సిద్ధార్థలో ఉట్టి కొడుతూ...



జంక్షన్ భారతీ విద్యాభవన్లో ఉట్టి కొడుతున్న విద్యార్థి



గన్నవరం యాదవ రామాలయంలో లక్ష పుష్పార్చన



జంక్షన్ చైతన్యలో...

విస్తృతంగా పారిశుద్ధ్య పనులు

పెద్దఆవుటపల్లి, ఆత్కూరు(ఉంగుటూరు), న్యూస్‌టుడే : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీ నుంచి 50 రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం పెద్దఆవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు గ్రామాల్లో పనులు ప్రారంభించారు. పెద్దఆవుటపల్లిలో జోసఫ్ తంబి ఆలయం నుంచి జాతీయ రహదారి వరకు మురుగునీటి పారుదల వ్యవస్థ వెంబడి ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. కాలువలో పూడిక తీయించారు. ఇప్పటికే గ్రామంలో మూడొంతుల మేర పారిశుద్ధ్య పనులు పూర్తి చేసినట్లు కార్యదర్శి పూర్ణచంద్రరావు తెలిపారు. ఆత్కూరులో డ్రైనేజిలో పూడిక తీశారు. రోడ్ల వెంట బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణకు నివాస ప్రాంతాల్లో పొగ వదిలారు. విద్యుత్తు తీగలకు అడ్డుగా వస్తున్న చెట్ల కొమ్మల వల్ల సరాఫరాలో అంతరాయం ఏర్పడుతోందని సర్పంచి కుర్రా సుబ్బారెడ్డి తెలిపారు. ఆయా కొమ్మలను సోమవారం తొలగించినట్లు ఆయన చెప్పారు. సిబ్బంది కొరత వల్ల సకాలంలో పారిశుద్ధ్య పనులు చేయలేకపోతున్నామన్నారు. పక్క గ్రామాల నుంచి కూలీలను రప్పించి పనులు చేస్తున్నట్లు వివరించారు.



పెద్దఆవుటపల్లిలో ముళ్లకంపను తొలగిస్తున్న దృశ్యం

సంఘటిత పోరాటంతోనే సమస్యల పరిష్కారం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : ప్రజాసమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే శరణ్యమని సీపీయం తూర్పు కృష్ణా జిల్లా కార్యదర్శి ఆర్. రఘు అన్నారు. సోమవారం గన్నవరంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన.. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. కేవలం పదవులు, అధికారమే లక్ష్యంగా భాజపా, తెదేపా ప్రభుత్వాలు అన్ని విలువలనూ తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. ప్రజల అసంతృప్తి, ఆవేదననూ పట్టించుకోవడం లేదన్నారు. పేదల ప్రజలకు కీలకమైన సంక్షేమ విధానాలు నిర్వీర్యమవుతున్నాయనీ, మానవహక్కులను కాలరాస్తున్నారనీ ఆరోపించారు. వామపక్షేతర పార్టీలన్నీ అధికారమే లక్ష్యంగా గల రాజకీయ క్రీడలో ప్రజలను పావులను చేస్తున్నాయని పేర్కొన్నారు. వామపక్షాల కార్యకర్తలు ప్రజలను చైతన్యపరచి, సమస్యలకు వ్యతిరేకంగా పోరాడేందుకు సంఘటిత పరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సభలో వై. నరసింహారావు, కె. హరిబాబు, కె. వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘు

చెరువులను నీటితో నింపాలి

గన్నవరం (హనుమాన్ జంక్షన్), న్యూస్‌టుడే : మండలానికి ప్రధాన నీటి వనరైన బ్రహ్మయ్య లింగయ్య చెరువును పోలవరం కాలువ నీటితో నింపాలి. అవసరమైతే కాలువపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని తెదేపా మండల కమిటీ తీర్మానించింది. పడమట సురేష్ అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించారు. గన్నవరం మండల అభివృద్ధి కోసం వివిధ తీర్మానాలు చేశారు. మండలంలో ఇళ్లు లేని పేదవారికి నివేశన స్థలాలు కేటాయించాలని, గ్రామాల్లోని చెరువులన్నిటినీ పట్టిసీమ నీటితో నింపాలని పేర్కొన్నారు. ఇంటింటికీ తెదేపాను శక్తియుక్తులతో నిర్వహించాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే వంశీకి ధన్యవాదాలు చెబుతూ పార్టీ కార్యవర్గం తీర్మానించింది. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పొట్లూరి బసవరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు పాలడుగు నాని, నర్రా మాలతి, అబ్దుల్ కలాం, అనగాని రవి, దొంతు చిన్నా నల్లూరి వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పడమట సురేష్

పూరిళ్లు దగ్ధం

మడిచర్ల(హనుమాన్‌జంక్షన్ (గ్రామీణం), న్యూస్‌టుడే : మడిచర్ల ఎస్సీ కాలనీలో సోమవారం తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండిళ్లు దగ్ధమయ్యాయి. కూకటి భిక్షాలు, కూకటి మరియమ్మ పక్కపక్కనే తాటాకిళ్లల్లో నివసిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున భిక్షాలు ఇంట్లో విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. నిద్రపోతున్న వారు మంటలను గమనించి ఆందోళనతో బయటకు వచ్చేశారు. అగ్ని కీలల్ని అదుపు చేసే లోపే దట్టంగా వ్యాపించడంతో రెండిళ్లు పూర్తిగా కాలిపోయాయి. రెండు కుటుంబాల వారు కట్టుకున్న దుస్తులతో మిగిలాయి. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి నష్టం వివరాలు నమోదు చేసుకున్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు సిద్ధం

రామవరప్పాడు(విజయవాడ గ్రామీణం), న్యూస్‌టుడే : రాధాకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాధాకృష్ణ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులి. వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం రామవరప్పాడులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్యాణి టెంట్ హౌస్ ఆవరణలో మంగళవారం పూజలు, జెండా వందనం, అన్నప్రసాద వితరణ, శోభాయాత్ర, ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు యాదవ్, మంత్రులు రామకృష్ణ, ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే వంశీ మోహన్ తదితరుల పాల్గొంటారని చెప్పారు. భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దీనికి సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు.

యాదవ సంక్షేయ సంఘం ఆధ్వర్యంలో.. యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు కె. రవికుమార్ తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామవరప్పాడులోని వేమినేని రామస్వామి వారి వీధిలో పూజలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఉంటాయన్నారు. మంత్రి రామకృష్ణ, మాజీ మంత్రి పార్థసారధి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

సమాచార వాహిని

మార్గదర్శి గవర్నరుపేట శాఖలో చిట్ గ్రూపుల వివరాలివి

విజయవాడ : మార్గదర్శి చిట్‌ఫండ్, అమ్మన్న ఎస్టేట్స్, మ్యూజియం రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ-2 శాఖలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న చిట్‌గ్రూపుల వివరాలు ఇలా ఉన్నాయి. అదనపు సమాచారం కొరకు K.కృష్ణమోహన్, సీనియర్ బ్రాంచి మేనేజర్‌ను సంప్రదించవచ్చు.

ఫోన్ నెంబర్లు : 0866-2433270, 2432870, 2435270, 2435280

సెల్ నెంబరు : 80082 23481

క్రమ సంఖ్య	నెలసరి వాయిదా	నెలలు	చిట్ విలువ
1.	1,00,000	50	50,00,000
2.	1,00,000	40	40,00,000
3.	1,00,000	30	30,00,000
4.	75,000	40	30,00,000
5.	50,000	50	25,00,000
6.	50,000	40	20,00,000
7.	20,000	50	10,00,000
8.	25,000	40	10,00,000
9.	40,000	25	10,00,000
10.	30,000	30	9,00,000
11.	15,000	40	6,00,000
12.	20,000	25	5,00,000
13.	12,500	40	5,00,000
14.	10,000	50	5,00,000
15.	10,000	30	3,00,000
16.	6,000	50	3,00,000
17.	10,000	25	2,50,000
18.	5,000	40	2,00,000
19.	4,000	25	1,00,000
20.	2,500	40	1,00,000
21.	1,250	40	50,000

వేకెంట్ చిట్‌లు కావలసినవారు బ్రాంచి మేనేజరును సంప్రదించగలరు.

గన్నవరం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీ



న్యాయం చేశాకే విస్తరణ పనులు

బుద్ధవరం(హనుమాన్‌జంక్షన్), న్యూస్‌టుడే : విమానాశ్రయ విస్తరణ కోసం తీసుకున్న భూముల నిర్వాసితులకు పూర్తిగా సంతృప్తి కలిగించాకే విస్తరణ పనులు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బుద్ధవరం, అజ్జంపూడి, దావాజీగూడెం తదితర గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు. విస్తరణలో గన్నవరం-బుద్ధవరం, అజ్జంపూడి రహదారి వేరుపడటం, భూముల స్వాధీనం త్వరలో ప్రారంభం కానుందనే వార్తలు ప్రబలడంతో.. గత కొంతకాలంగా బుద్ధవరం ప్రాంత ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి నిర్వాసితులతో బుద్ధవరంలో సమావేశం ఏర్పాటు చేశారు. చింతపల్లి లక్ష్మారాయుడు సమావేశమందిరంలో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే వంశీతో పాటు విమానాశ్రయ డైరెక్టరు మధుసూదనరావు, ఆర్డీవో చెరుకూరి రంగయ్య, ఎంపీపీ పట్రా కవిత, వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, బుద్ధవరం సర్పంచి తిరువీధి మరియమ్మ, నీటిపారుదలశాఖ, రహదారుల శాఖ అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. విస్తరణ వల్ల దారి పోతున్న దావాజీగూడేనికి ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేసిన తర్వాతే ఉన్న దారిని తొలగించాలని నిర్ణయించారు. వ్యక్తిగతంగా భూములు కోల్పోయే నిర్వాసితులను గుర్తించి, వారికి తగిన పరిహారం ఇచ్చాకే భూములను స్వాధీనం చేసుకుంటారని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బంజరు భూముల్లో ఉన్న రైతులకు న్యాయం చేసే విషయం ముఖ్యమంత్రితో మాట్లాడి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరికీ సంతృప్తి కలిగించే నిర్ణయాలు తీసుకున్నాకే నిర్వాసితులకు నోటీసులు జారీ చేయవద్దని ఎమ్మెల్యే అధికారులకు విజ్ఞప్తి చేశారు.



విఘ్నేశ్వరుడిని ఆవిష్కరిద్దాం

ఈ నెల 25న వినాయక చవితి. ఈ పండుగకు పర్యావరణ హిత గణపతి విగ్రహాలను వినియోగిద్దాం. మట్టి, కూరగాయలు, వివిధ రకాల ఫలాలు, మిఠాయిలు తదితర తినుబండారాలతో పాటు మట్టిలో సులభంగా కలిసిపోయే గుణాలు గల పదార్థాలతో మట్టి ప్రతిమల్ని తయారు చేయొచ్చు. బొజ్జగణపయ్యతోపాటు తల్లిదండ్రులైన శివపార్వతులతో కలిసి ఉన్న ఆది దేవుని రూపాలను చిత్రలేఖనం ద్వారా ఆవిష్కరించొచ్చు. ఇలా విద్యార్థులు, పిల్లలు తయారు చేసిన గణపతి బొమ్మలు, గీసిన చిత్రాలను 'ఈనాడు'లో ప్రచురించదలిచాం. మీరు చేయాల్సిందల్లా మీరు సృజనాత్మకంగా తయారు చేసిన ప్రతిమ, గీసిన చిత్రాలను మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ కింది పేర్కొన్న వాట్సప్ సంఖ్యకు పంపడమే. వాటిలో విభిన్నమైన వాటిని ఎంపిక చేసుకొని ప్రచురిస్తాం.

మా వాట్సప్ సంఖ్య
98486 27585

రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

గన్నవరం(హనుమాన్‌జంక్షన్), న్యూస్‌టుడే : విద్యుత్తు తీగల మరమ్మతుల వల్ల ఈ నెల 16వ తేదీన గన్నవరం విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు కోత విధిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ కార్యాలయ ప్రాంతం, కొత్తపేట, చెంచులపేట, పాత గన్నవరం, చింతలపేట, సొసైటీ పేట, సుబ్బారావు నగర్, రామ్ నగర్, టాటా స్టీలుపేట, గౌడపేట, బుద్ధవరం రోడ్డు, శ్రీనగర్ కాలనీల్లో సరఫరా ఉండదన్నారు.

సాగు: పద్ధతి మారింది. 'అమెరికా, యూరప్ దేశాల్లో ఇప్పుడు పచ్చిరొట్ట ఎరువుకు ఇస్తున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువులను ప్రతి పొలంలోనూ తప్పకుండా వేస్తుంటారు. ఇప్పుడు అన్ని చోట్లా రసాయనిక ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించేశారు. పైగా యంత్రాల వినియోగమూ పెరిగి రైతుకు పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతోంది.

జన్మభూమిలో: అమెరికాలో వ్యవసాయాన్ని మన దగ్గరా.. అంటే గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం పెదపాలెంకు చెందిన సురేష్ గుత్తికొండ ప్రారంభించారు. గతేడాది సాగు ప్రారంభించిన ఆయన ఈ ఏడాది మరింత విస్తీర్ణం పెంచారు. ఆ వివరాలు విశేషాలు ఆయన మాటల్లోనే..



పెదపాలెం-చినపాలెం మధ్య పొలంలో పచ్చిరొట్ట ఎరువుగా వేసిన జనుమును తొక్కించిన వైనాన్ని పరిశీలిస్తున్న సురేష్

అక్కడ ఉద్యోగం

ఇక్కడ వ్యవసాయం

స్ఫూర్తి బాటలో దుగ్గిరాల ఇంజినీరు

పెదపాలెం (న్యూస్‌టుడే), దుగ్గిరాల

అమెరికాలో ఒక్కోరైతు 400 నుంచి 500 ఎకరాలు సాగు చేస్తారు. అంతా యంత్రాలతో కావడంతో సాగు తేలిగ్గానే ఉంటుంది. తండ్రీకొడుకులు ఉంటే ఇద్దరు కలిపి 1000 ఎకరాలు సాగు చేస్తారు. భూమిని దున్నడం అనేది పూర్తిగా తగ్గించారు. ఒక యంత్రం దాని ముందు భాగం నేలను కొద్దిగా గుల్లగా చేస్తుంటే.. వెనుక భాగం రంధ్రాలు చేస్తూ వెళుతుంది. మరో యంత్రంతో ఆ రంధ్రాల్లో విత్తనాలు వేయడం, వెంటనే మట్టి కప్పేయడం జరుగుతుంది. కొన్ని చోట్ల అయితే ఈ నాలుగు పనులూ ఒకే యంత్రం ద్వారా జరిగిపోతాయి.

దున్నకం : మనం ఇక్కడ దున్నకం ఒక్క రోజు.. విత్తు మరో రోజు పడుతుంది. అమెరికాలో అయితే అరగంటే పడుతుంది.



భూసారాన్ని ఎలా పెంచాలో వివరిస్తున్న జి.సురేష్

అమెరికాలో: ఒకే యంత్రంతో దున్నడం, విత్తడం ఒకేసారి జరిగిపోతాయి. పైగా ఆ ప్రాంతంలో ఏ పంట పండుతుందో అధికారులు చెబుతారు. ఆ సమాచారంలో కచ్చితత్వం ఉంటుంది. దానిని బట్టే రైతులు ఆ పంటలే వేస్తారు.

గిట్టుబాటు ధర సమస్యే కాదు : మన దేశంలో అన్నదాతకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉండడం లేదు. ఆత్మహత్యలకు ప్రధాన కారణం అదే అనుకుంటున్నారు. అమెరికాలో పంటకు ధర రాకపోతే దానిని నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది.

సొసైటీ సాగు : కొన్ని చోట్ల ఒక సొసైటీ బృందం భూములు తీసుకుని సాగు చేస్తుంది. దీనికి రైతుకు రాయల్టీ (కౌలు) ఇస్తారు. ప్రధానంగా గోధుమ, సోయాబీన్ ఎక్కువ సాగు చేస్తారు. వీటి వాడకం పిజ్జా, బర్గర్‌లలో ఎక్కువ. వాళ్ల ఆహారం ఎక్కువగా రొట్టెలు కావడం వల్ల ఆ పంటలే పండిస్తారు. పైగా ఇతర దేశాలకు బాగా ఎగుమతి చేస్తారు.

వాతావరణాన్ని బట్టి: అమెరికాలోని ఒక్కో రాష్ట్రంలో వాతావరణం ఒక రకంగా ఉంటుంది. మంచు, చలి ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో యాపిల్ పండిస్తారు. వేడి ఎక్కువగా ఉండే చోట్ల ఆరంజ్ ఇతర పంటలు సాగుచేస్తారు. మేముండే కాలిఫోర్నియాతో పాటు ఫ్లోరిడా, న్యూయార్క్ ఇలా చాలా చోట్ల పండ్లు, కూరగాయలు, దుంపలు, మొక్కజొన్న, బాదం పండిస్తున్నారు. పంటలకు నీరు పెట్టేందుకు తుంపర సేద్యాన్నే అమలు చేస్తారు.

వరి సంగతి : న్యూయార్క్‌లో కొన్ని చోట్ల మాత్రమే వరి వేస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో కొద్ది మంది మాత్రమే భోజనం తీసుకుంటారు.

పచ్చిరొట్ట ఎరువులు: పంటల సాగుకు ముందు అందరూ పచ్చిరొట్ట ఎరువులను వేస్తున్నారు. అమెరికాలోనే కాదు యూరప్ అంతా పచ్చిరొట్ట వాడకం విపరీతంగా పెరిగింది. యంత్రాల్ని వినియోగించి ఇక్కడ వెద పెట్టినట్లుగా అన్ని పంటల విత్తనాల్ని విత్తుతున్నారు.

యువతే ఎక్కువ: గొప్ప విషయమేమంటే ఇప్పుడు యువత ఎక్కువగా వ్యవసాయం వైపు మళ్లుతున్నారు. గతంలో వీళ్లంతా పొలాలు వదిలేసి పట్నాలకు వెళ్లినవారే. ఇప్పుడు మళ్లీ వెనుతిరిగారు. మిసిసిపీ నదీ పరివాహక ప్రాంతంలో లక్షలాది ఎకరాలు సాగులో ఉన్నాయి.

ఇక్కడ వ్యవసాయం ఒక్కసారి పరిశీలిస్తే.. : సురేష్ 30 ఏళ్లుగా అమెరికాలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది ఖరీఫ్ సాగు ప్రారంభంలోనే స్వగ్రామం పెదపాలెం వచ్చారు. తనకు ఉన్న 8 ఎకరాల్లో మాగాణిలో వరి పండించారు. భూమిలో సారం పెంచేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా ఎరువులు తెప్పించారు. సాగుకు ముందే భూమిలో ఇవి వేశారు. వాటితోపాటు పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ, జనుము వేశారు. ఖరీఫ్ ప్రారంభం కాగానే పచ్చిరొట్ట ఎరువుల్ని చేలో కలియదున్ని వరి వేశారు. తర్వాత ఆయన అమెరికాకు వెళ్లినా ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ వచ్చారు.



అమెరికాలో స్ప్రింక్లర్లతో కూరగాయల సాగు

ప్రకృతి సాగువైపు : సురేష్ అందరిలాగా రసాయనిక ఎరువులు ఒక్క బస్తా కూడా వేయలేదు. మూడు నెలలకే మళ్లీ వచ్చిన ఆయన వరి కొంత పెరిగాక ఆవు మూత్రాన్ని, పేడను నీటికి కలిపి పలుచగా చేసి చేలో దగ్గరుండి సాళ్ల మధ్యలో పోయించారు.

ఫలితం ముందుగానే: గ్రామంలో అందరి రైతుల కన్నా 15 రోజులు ముందుగానే పంట వచ్చేసింది. ఎకరాకు 22 బస్తాల దిగుబడి వచ్చింది. ఖర్చు బాగా తగ్గింది. అందుకే ఈ ఏడాది తన వ్యవసాయాన్ని పెంచారు. బంధువుల పొలం కూడా తీసుకుని దాదాపు 50 ఎకరాల్ని పర్యవేక్షిస్తున్నారు. అంతటా పచ్చిరొట్ట ఎరువుల్ని వేయించారు. ఇక్కడ వ్యవసాయాధికారిని కలిసి సూడో మోనాస్, ట్రైకోడెర్మావిరిడి వంటివి రాయితీపై తీసుకుని భూమికి వేస్తున్నారు.



అమెరికాలో యంత్రంతో సాగు చేస్తున్న దృశ్యం

ఖర్చులో తేడా ఇదీ

సురేష్ చేసిన సాగు విధానంలో

వేసవిలో దుక్కి దున్నినందుకు	రూ. 1000
పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు, కూలీ కలిపి	రూ. 700
బస్తా ఆముదపు పిండి, బస్తా వేప పిండి	రూ. 1750
యంత్రంతో నూర్చినందుకు	రూ 3500
ఎకరా ఖర్చు	రూ 6950


మొదటిసారి 22 బస్తాల దిగుబడి వచ్చింది. ధాన్యం బస్తా రూ. 1250 అనుకుంటే ఆదాయం రూ. 27500 వచ్చింది. ఖర్చు పోను రూ. 20,550 మిగిలింది. వరికి వేసిన పచ్చిరొట్ట బలం రెండో పంటకూ ఉపయోగపడింది.

ఇతర రైతులు చేసే విధానంలో ఖర్చు

దుక్కికి	రూ. 1000
దమ్ముకు	రూ. 1000,
విత్తనం, నారు పెంచినందుకు	రూ. 700
నారు పీకి నాట్లు వేసినందుకు	రూ 3500,
కలుపు తీసినందుకు	రూ 1000,
ఎరువులు, పురుగుమందులు	రూ. 5000,
కోత, కుప్ప వేసినందుకు	రూ. 3500,
నూర్చినందుకు	రూ. 4000
మొత్తం	రూ. 19700

దిగుబడి 27 బస్తాలు వచ్చింది. ఆదాయం రూ. 33750 వచ్చింది. ఖర్చులు పోను రూ. 14000 మిగిలింది. ఇక్కడ రెండో పంటకు బలం కోసం మళ్లీ రూ. 6000 వరకు ఖర్చు అయింది.

జలధీశ్వరుని సేవలో సామాజిక సంక్షేమ శాఖ సంచాలకుడు



రామారావు దంపతులకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న వెంకటరామకృష్ణ, తదితరులు

ఘంటసాల, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ శాఖ సంచాలకుడు ఎం.రామారావు-ధనలక్ష్మి దంపతులు ఘంటసాలలోని బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం దర్శించుకున్నారు. ఆలయమర్యాదలతో పురోహితులు, సిబ్బంది వారిని స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో విశేషపూజలు నిర్వహించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు అనుసంధానంగా సమీకృత వసతిగృహాలను ఏర్పాటు చేసి విద్యాబోధనలో మరింత మెరుగైన సాధనకు కృషిచేస్తున్నామని తెలిపారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ, వీఆర్వో వీరరాఘవులు, విశ్రాంత బ్యాంక్‌మేనేజర్ మండవ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ రహిత సమాజం కోసం పోరాటం

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేష్



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేష్

నందిగామ, న్యూస్‌టుడే: దోపిడీ రహిత సమాజం కోసం ఏఐటీయూసీ పోరాటం చేస్తోందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేష్ అన్నారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఉద్యమాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. నందిగామలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సంఘం కోస్తాంధ్ర జిల్లాల ప్రతినిధుల శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ముగింపు సమాశానికి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జరబన నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఓబులేష్ మాట్లాడుతూ యాజమాన్యాల దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులంతా ఏకమై పోరాటం చేయాలని సూచించారు. సమష్టి నిర్ణయాలు, వ్యక్తిగత బాధ్యతలు తీసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ అనేక ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న హక్కులు, చట్టాలను పాలకులు హరించి వేస్తున్నారని విమర్శించారు. కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా ఉండి వాటిని కాపాడుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు కొండపల్లి అప్పారావు ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, రాధాకృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చుండూరు వెంకట సుబ్బారావు, సీపీఐ పట్టణ కార్యదర్శి బండారు వెంకట్రావు, ఆహ్వాన కమిటీ సభ్యులు పర్చూరి రాజేంద్రబాబు, ఆవుల గోపీనాథ్, అరుణ్, హస్సేన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిరంకుశ విధానాలపై దిల్లీలో ఉద్యమం

నందిగామ, న్యూస్‌టుడే: పాలకుల నిరంకుశ విధానాలకు నిరసనగా దిల్లీలో 183 కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేష్ తెలిపారు. దీని కోసం అన్ని సంఘాలు సమాయత్తమవుతున్నాయని చెప్పారు. ఏఐటీయూసీ కోస్తా జిల్లాల ప్రతినిధుల శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ఆయన నందిగామలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నవంబరు ఎనిమిది, తొమ్మిది, పది తేదీల్లో పార్లమెంట్‌ను దిగ్బంధించాలని జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు అవుతున్నా, దేశంలో ఏ వర్గానికి ప్రయోజనం లేదని విమర్శించారు. పెద్ద నోట్లు రద్దు తర్వాత జీడీపీ 6.1కు పడిపోయిందని, దీని వల్ల అల్పాదాయవర్గాలపై పన్ను భారం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రచార ఆర్భాటం మినహా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం లేదన్నారు.

ఈటీవీలో ఈనాడు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈటీవీ ప్రత్యేక కార్యక్రమాలు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: కుజ, రాహు, కేతు గ్రహాలు అనుకూలించాలంటే... మంగళవారంరోజు ఏం చేయాలి?, ఆరోగ్యసిద్ధికి వాస్తురీత్యా ఏం చేయాలి?, 08-30: టాలీవుడ్ టైమ్: 09-00: స్పెషల్ ఈనాడు సినిమా: సర్దార్ పాపారాయుడు (ఎన్టీఆర్, శ్రీదేవి, శారద).

ఆంధ్రారాజధాని అమరావతికి 5kms దూరంలో CRDA అప్రూవల్ ఎక్స్‌ప్రెస్ హైవే & IRR ఆనుకొని వెంచర్లు కలవు. బ్యాంక్ లోన్ కలదు. ✆ 9951365143

కొలనుకొండ మెయిన్‌రోడ్డు E/F 150 చ.గ. రెండు స్థలాలు ఇళ్ళమధ్య ప్రక్కప్రక్కన కలవు. విడిగా/మొత్తంగా అమ్మకం కలవు. చ॥గ॥ రూ. 6,500 ✆ 80087 83669.

భవాని R/E వారి పామర్రు, కంకిపాడు, నిమ్మకూరు, తరకటూరులలో బందరురోడ్డుని ఆనుకుని ఇంటి నిర్మాణమునకు అనువైన ప్లాట్లు అతితక్కువ ధరలకే కలవు. ✆ 81257 77878, 73967 87071.

TO-LET

బ్రాహ్మణ ఇల్లు అద్దెకు మాచవరం SRR సెంటర్ వద్ద 4 గదులపోర్షన్ బ్రాహ్మణులకు/ వైశ్యులకు మాత్రమే అద్దెకు ఇవ్వబడును. ✆ 2431404, 94907 54400.

బందర్‌రోడ్డు టైమ్‌హాస్పిటల్ వెనుక తులసీనగర్ నందు అన్ని వసతులతో, నార్త్ ఈస్ట్ ఫేసింగ్‌తో 3 B/R ఫ్లాట్స్ అద్దెకు కలవు. ✆ 98495 45117, 94901 13583.

Near DV Manor Hotel 2000 S.Ft, 1000 S.Ft GF, 1000 S.Ft FF, 2000 S.Ft SF, 3000 S.Ft (Furnished) Available for Office/ Godown/ Coaching Centres. ✆ 82473 17354.

కనకదుర్గమ్మ వారధి దాటిన తర్వాత తాడేపల్లి, పాతూరు రోడ్డు, అతిధి ఎన్‌క్లేవ్ నందు 3 B/R ఫ్లాట్ వుడ్‌వర్క్ కార్‌పార్కింగ్, జనరేటర్‌తో అద్దెకు కలదు. ✆ 91107 46843.

ఎనికేపాడు KVR కాలనీలో 3 BHK సూపర్ లగ్జరీ డీలక్స్ 2000 S.Ft. 2nd ఫ్లోర్ E/F లిఫ్ట్ & కార్ పార్కింగ్‌తో ఎంప్లాయిస్‌కు అద్దెకు ఇవ్వబడును. ✆ 98499 47474.

పోరంకి, సాలిపేటరోడ్, చైతన్య కాలేజి దగ్గర. S.V.G. నందు ఇండిపెండెంట్‌హౌస్ 2 B/R (No 21). కార్‌పార్కింగ్, గేటెడ్ కమ్యూనిటి అద్దెకు ✆ 94411 92128, 2555171.

సిద్ధార్థనగర్, SBI కాలనీ, నెం.1, D.No: 60-25-8లో గ్రౌండ్‌ఫ్లోర్ 2 B/R, కార్‌పార్క్ సౌకర్యం. 24 గం॥ నీటి వసతి Govt/ బ్యాంకు ఉద్యోగస్థులకు ప్రాధాన్యత. ✆ 94401 83449.

COMMERCIAL

విజయవాడ, 1 టౌన్ హిందూ హైస్కూల్ దగ్గర, శింగరాజువారి వీధిలో గ్రౌండ్ ఫ్లోర్ 2600 చ॥అ॥లు, 1వ అంతస్థులో 2800/- చ॥అ॥ గలది అద్దెకు. ✆ 87122 32323.

3500 S.Ft. For Rent

విజయవాడ బందరురోడ్డు
కళానికేతన్ ప్రక్కన
కమర్షియల్ కాంప్లెక్స్‌నందు
3500 S.Ft. గల 5th ఫ్లోరు
Plug and Playతో
కార్పొరేట్ ఆఫీసులకు అద్దెకు.
☎ 95053 31020

VJA, 1 టౌన్, రమణయ్య కూల్‌డ్రింక్స్ దగ్గర 1200 చ॥అ॥ ఫస్ట్‌ఫ్లోర్ C&F ఏజన్సీ/ మెడికల్/ ఆఫీస్, ఎలక్ట్రికల్ ఏజన్సీలకు అద్దెకు ✆ 98853 22721.

VJA, చిట్టినగర్, కలరాహాస్పటల్ ఎదురు, 30 చ.గ. గ్రౌండు ఫ్లోర్, షాపులు/ ఆఫీసులకు అద్దెకు. కొప్పురావూరి ప్రసాదరావు ✆ 92478 51351.

MORE CLASSIFIEDS ON PAGE 13

నేడు రెండు లారీల ఉల్లిగడ్డల లోడు రాక

విజయవాడ సబ్‌కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉల్లిపాయల ధరలు తగ్గుముఖం పట్టడంతో పాటు, ప్రజల అవసరాలకు సరిపడా సరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వ్యవసాయ మార్కెటింగు శాఖ అధికారులు తెలిపారు. విజయవాడలోని రైతు బజార్లకు ఆదివారం ఒక లారీ లోడు ఉల్లిపాయలు రాగా, కిలో రూ.22లు చొప్పున విక్రయించినట్లు చెప్పారు. ఇదే ధర సోమవారం కూడా కొనసాగిందన్నారు. మంగళవారం మరో రెండు లారీల సరకు జిల్లాకు రానున్నట్లు తెలిపారు. వీటిలో ఒక లారీని విజయవాడలోని రైతుబజార్లకు, రెండో లారీని మచిలీపట్నం, గుడివాడ రైతుబజార్లకు కేటాయించనున్నట్లు వివరించారు.

18న ఒంగోలు జాతి అభివృద్ధిపై చర్చాగోష్ఠి

గాంధీనగర్ (విజయవాడ) న్యూస్‌టుడే: ఒంగోలు జాతి పశుపోషకుల సమావేశం, ఒంగోలు జాతి అభివృద్ధిపై చర్చాగోష్ఠిని ఈ నెల 18వ తేదీన గాంధీనగర్‌లోని శ్రీరామా ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి తెలిపారు. సోమవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, పి.మాణిక్యాలరావు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 5గంటలకు రైతు నేస్తం పబ్లికేషన్స్ ప్రచురించిన డాక్టర్ ఎం.శివరామ్ రచించిన 'గోసంజీవని' 'ఆవులు, ఎద్దులు, సుళ్లు' పుస్తకాల ఆవిష్కరణ, పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతు నేస్తం ఎడిటర్ వై.వెంకటేశ్వరరావు, డాక్టర్ శివరామ్ పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బస్టేషన్, న్యూస్‌టుడే: వరుసగా సెలవులు రావడంతో నగరం నుంచి సొంత ఊర్లకు చేరుకున్న ప్రయాణికులు తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిప్యూటీ సిటీ ట్రాఫిక్ మేనేజర్ కె. నాగేంద్రబాబు సోమవారం తెలిపారు. పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విశాఖపట్నం, రాయలసీమ తదితర రూట్లలో షెడ్యూల్‌లో ఉన్న బస్సులకు అదనంగా సుమారు 150 ప్రత్యేక బస్సులు నడపడానికి అధికారులు నిర్ణయించారని తెలిపారు. ప్రత్యేక బస్సులకు అడ్వాన్స్‌డ్ టికెట్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ఏటీబీ ఏజెంట్ల ద్వారా, ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు రిజర్వ్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రయాణికుల సంఖ్య పెరిగితే బస్సులు పెంచేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సెలవుల చివరి రోజు మంగళవారం రాత్రి 8 గంటల నుంచి బస్సులు బయలు దేరుతాయని, అరైవల్ బ్లాక్‌లో 53 నుంచి 59 వరకు ప్రత్యేక ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేశామని, ప్రత్యేక బస్‌ల సర్వీస్ నెంబర్లు 9500 నుంచి వరుస సంఖ్యలో ఇచ్చామన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విజయవాడలో ఈనాడు

☛ *మంగళవారం ఉదయం 8 గంటలకు కృష్ణలంక మెట్ల బజారులో 70 అడుగుల జెండాతో చిన్నారుల ప్రత్యేక ఊరేగింపు, సాయంత్రం 5 గంటలకు కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమం.*

☛ *ఉదయం 9 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయంలో స్వాతంత్ర్యదినోత్సవాలు ప్రారంభం.*

☛ *ఉదయం 9 గంటలు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాలు ప్రారంభం.*

☛ *ఉదయం 9 గంటలకు సత్యనారాయణపురంలోని ఎ.కె.టి.పి.ఎం. హైస్కూల్‌లో 'నా దేశం-నా జెండా' ప్రపంచ రికార్డు సాధన కార్యక్రమం.*

☛ *ఉదయం 9 గంటలకు గవర్నర్‌పేటలోని స్వాతంత్ర్యసమరయోధుల భవనంలో స్వాతంత్ర్యదినోత్సవాలు.*

☛ *ఉదయం 10 గంటలకు గాంధీనగర్‌లోని ఛాంబర్ భవన్‌లో విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీలో స్వాతంత్ర్యదినోత్సవాలు.*

☛ *ఉదయం 11 గంటలకు బెంజిసర్కిల్‌లోని వేదిక కల్యాణమండపంలో హరేకృష్ణ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రారంభం.*

☛ *సాయంత్రం 4 గంటలకు గవర్నర్‌పేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో వికాస విద్యావనం ఆధ్వర్యంలో 'మీడియం మీమాంస' అనే అంశంపై సదస్సు*

☛ *సాయంత్రం 5 గంటలకు మొగల్రాజపురంలోని ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతిలో విజయవాడ బుద్ధ విహార, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి సంయుక్త ఆధ్వర్యంలో 'స్వాతంత్ర్యం ముందు రోజు' డాక్యుమెంటరీ ప్రదర్శన.*

☛ *సాయంత్రం 6 గంటలకు వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో కళాంజలి సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో స్వాతంత్ర్యదినోత్సవ పురస్కారాలు ప్రధానం.*

- న్యూస్‌టుడే, గవర్నర్‌పేట

16న రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ జట్ల ఎంపికలు

నూజివీడు రూరల్: ఈ నెల 16వ తేదీన నూజివీడులోని ఎస్సార్ఆర్ బాలుర పాఠశాలలో రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ కార్యదర్శి డి.సూర్యనారాయణ తెలిపారు. 1 ఏప్రిల్, 2003 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు పీఈటీ ఎన్.భాస్కర్ 94406 96797 ఫోన్ నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

అమరావతి సమాచారం



ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై నటరాజ మండప మార్గంలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మహిళలు రాహుకేతు పూజ చేస్తారు. నిమ్మకాయ దొప్పల్లో ఆవు నెయ్యితో దీపారాధన చేసి మహిళలు స్వయంగా ఈ పూజను చేస్తారు.

★ దుర్గగుడి అంతరాలయంలో వేకువజామున 4 గంటల నుంచి 5 గంటల వరకు జగన్మాత దుర్గమ్మకు ఖడ్గమాల పూజ నిర్వహిస్తారు. స్థలాభావం కారణంగా టిక్కెట్టు రుసుము రూ.5,116 చెల్లించిన 12 మంది భక్తులను మాత్రమే ఈ పూజకు అనుమతిస్తారు.

★ మల్లికార్జున మహామండపం ఒకటో అంతస్తులో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు గంగా, పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులకు శాంతి కళ్యాణం చేస్తారు. ఆరో అంతస్తులో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు లక్ష కుంకుమార్చన, అష్టోత్తరం, సహస్ర నామార్చన పూజలు నిర్వహిస్తారు.



రూ.300 దర్శనం టిక్కెట్లు : ఆగస్టు 22 నుంచి నవంబరు 30వ తేదీ వరకు అందుబాటులో ఉన్న మేరకు జారీ చేస్తారు.
కాటేజిలు : అక్టోబరు 8 నుంచి నవంబరు 30వ తేదీ వరకు అందుబాటులో ఉన్నవి కేటాయిస్తారు.
అర్జిత సేవలు : అక్టోబరు 14, 15 వ తేదీకి బుధవారం జారీ చేయనున్నారు.
ఈ దర్శనం కేంద్రాల్లో లభ్యమయ్యే సేవలు : కల్యాణం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకరణ, విశేష పూజలు
గమనిక : దర్శనం, సేవా టిక్కెట్లు పొందాలనుకునే భక్తులు ఆధార్, పాస్‌పోర్టు, పాన్ కార్డులలో ఏదో ఒకటి తమ వెంట తీసుకురావాలి.
★ రూ.300 టిక్కెట్లు పొందాలనుకునే భక్తులు ఎంత మందైనా వారికి సంబంధించిన ఆధార్ పత్రాలు తీసుకుని ఒక వ్యక్తి వచ్చి తీసుకోవచ్చు.
★ సేవా టిక్కెట్లు కావాల్సిన భక్తులు ప్రతి ఇద్దరికి ఒకరు విధిగా కేంద్రానికి రావాలి.
★ వాట్సాప్, చరవాణిలో ఉన్న గుర్తింపు పత్రాలు అంగీకరించరు.
★ కేంద్రం తెరిచి ఉండే వేళలు : సోమవారం నుంచి శనివారం వరకు, ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 2 నుంచి రాత్రి 7 గంటల వరకు. ప్రతి మంగళవారం సెలవు.

-న్యూస్‌టుడే, లబ్బీపేట (విజయవాడ సిటీ)

స్వరాజ్యమైదాన్ రైతుబజారులో (నిన్నటి ధరలు)

విజయవాడ సబ్‌కలెక్టరేట్: వంకాయలు రూ.20/24, టమాట రూ.40, బెండ రూ.16, పచ్చిమిర్చి రూ.25, కాకర రూ.14, బీర రూ.12, క్యాబేజి రూ.17, క్యారెట్ రూ.53, దొండ రూ.14, బంగాళదుంప రూ.13, ఉల్లిపాయలు రూ.22, గోరుచిక్కుళ్లు రూ.20, దోస రూ.12, సొర రూ.6/5, పొట్ల రూ.10/8, అరటికాయ రూ.8/7, చామదుంప రూ.25, ములక్కాయ రూ.5/6, ఆకు కూరలు కట్ట రూ.2, కంద రూ.24, బీట్‌రూట్ రూ.22, కీరదోస రూ.18, బీన్స్ రూ.60, క్యాప్సికమ్ రూ.47, నిమ్మ (డజను) రూ.14/12, కొత్తిమీర కట్ట రూ.5/10, పూదీనా రూ.3/7, ముల్లంగి రూ.8, పచ్చిమామిడి రూ.7/8, అల్లం రూ.66. **గమనిక:** పటమట, కేదారేశ్వరపేట రైతుబజార్లలో కూడా ఇవే ధరలు వర్తిస్తాయి.

సినిమాలు

నేనే రాజు నేనే మంత్రి.. అన్నపూర్ణ, అలంకార్, వెంకటస్వర్ణ ప్యాలెస్, శ్రీనివాసమహల్, నీలిమ, రాంగోపాల్, దుర్గామహల్, వెంకటకృష్ణ (పోరంకి), శ్రీరామచంద్ర (కంకిపాడు), వెంకటేశ్వర డీలక్స్ (ఇబ్రహీంపట్నం), **జయ జానకి నాయక..** అప్సర, స్వర్ణప్యాలెస్, సౌమ్య, స్వర్ణలక్ష్మి (పాయకాపురం), వెంకటేశ్వర డీలక్స్ (పాయకాపురం), శ్రీనివాస (పోరంకి), శ్రీచంద్ర (కంకిపాడు), శివకృష్ణ (కొండపల్లి) **లై...** శైలజ, శకుంతల, నవరంగ్, రాజకుమారి, స్వాతి, రాఘవేంద్ర, వినాయక్, విజయలక్ష్మి (కానూరు), బాలాజీ సినీవిల్లా (పోరంకి), విజయలక్ష్మి (కంకిపాడు), బాలాజీ (ఇబ్రహీంపట్నం), **నక్షత్రం..** జయరాం, **గౌతమ్‌నంద..** వెంకటేశ్వర ప్యాలస్, **లై.., నేనేరాజు నేనే మంత్రి, జయ జానకి నాయక..** రవీంద్రసినిమాస్ (పాయకాపురం), **ఫిదా..** కపర్థి, రామకృష్ణ, **లంక..** కళ్యాణచక్రవర్తి,

ఐ3 - రాజ్, యువరాజ్: ఫిదా, నేనే రాజు నేనే మంత్రి, జయ జానకి నాయక, లై.

మీరజ్ సినిమాస్ (గాంధీనగర్): జయ జానకి నాయక, నేనే రాజు నేనే మంత్రి, లై

సినీ పోలీస్ (PVP) (యం.జి. రోడ్): జయ జానకి నాయక, లై, నేనే రాజు నేనే మంత్రి, ఫిదా, టాయిలెట్ ఏక్ ప్రేమ్ కథా,

క్యాపిటల్ సినిమాస్ (బెంజిసర్కిల్): జయ జానకి నాయక, లై, నేనే రాజు నేనే మంత్రి, ఫిదా, టాయిలెట్ ఏక్ ప్రేమ్ కథా, The Emoji Movie

Y. Screens: (బస్టాండ్): జయ జానకి నాయక, లై, నేనే రాజు నేనే మంత్రి

బోగస్ హాజరు..!

- భారీగా నిధులు దిగమింగుతున్న వైనం
- ప్రవేశాలు, వాస్తవ హాజరుకు ఎంతో వ్యత్యాసం

సాక్షాత్తు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు పది రోజుల కిందట గుంటూరులో ఓ గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన పరిశీలనలో బోగస్ హాజరు గుట్టు రట్టయ్యింది. ఎంతమంది విద్యార్థులు ఉన్నారని మంత్రి వార్డెన్‌ను ఆరా తీయగా 150 మంది అని ఠక్కున చెప్పారు. అనుమానం వచ్చి వెంటనే హాజరు పట్టీ తీసి చూడగా ప్రవేశాల సంఖ్య 125గా గుర్తించారు. వార్డెన్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన పరిశీలిస్తే 125 మంది పిల్లలు ఆయనకు కనిపించలేదు.

ప్రస్తుత మంత్రే కాదు. పూర్వపు మంత్రి రావెల కిశోర్‌బాబు ఆకస్మిక పర్యటనల్లో కూడా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అనేక వసతిగృహాల్లో బోగస్ హాజరు గుట్టు బయట పడింది.

అవినీతి నిరోధకశాఖ అధికారులు గత నెలలో కృష్ణాజిల్లా నందిగామలో 2, గుంటూరు జిల్లాలో రెండు వసతిగృహాలను ర్యాండమ్‌గా తనిఖీ చేయగా భారీగా బోగస్ హాజరు వేసినట్లు పరిశీలనలో తేలింది. పలు వసతిగృహాల్లో ప్రైవేటు ఉద్యోగులు తిష్టవేసి వసతి గృహాలను నడుపుతున్న వైనం గుంటూరు జిల్లాలో ఉంది.



నిజాంపట్నం బీసీ బాలికల వసతిగృహం

న్యూస్‌టుడే-అమరావతి

పేద విద్యార్థుల సంక్షేమానికి ఉద్దేశించిన వసతిగృహాల్లో సంక్షేమం బదులు అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే నిధులతో పేద పిల్లలకు మంచి రుచికరమైన భోజనంతో వారి పొట్టలు నింపాల్సిన వసతిగృహాల ఉద్యోగులు పిల్లల మాటున వారి జేబులు నింపుకుంటున్నారు. అక్రమార్జనకు అలవాటుపడిన ఉద్యోగులు పిల్లలు పొట్టకొట్టి తమ స్వార్థం చూసుకోవటంతో నానాటికీ ఈ గృహాలు పిల్లలకు దూరమవుతున్నాయి. పేదరికంతో సతమతమయ్యే అనేక కుటుంబాలు సైతం సంక్షేమ వసతిగృహాల్లో ఉండే దారుణ పరిస్థితులను తెలుసుకుని కనీసం ఒక్క పూట అయినా తమ పిల్లోడికి ఇంట్లోనే కడుపు నిండా భోజనం పెట్టుకుంటామని వసతిగృహాల నుంచి పిల్లలను ఇంటికి తీసుకుపోతున్నారు. సాంఘిక, గిరిజన, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖలకు చెందిన వసతిగృహాలు గుంటూరు జిల్లాలో 115 ఉండగా కృష్ణాజిల్లాలో 135 ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 14 వేల మంది, కృష్ణాజిల్లాలో 17 వేల మంది పిల్లలు వసతిగృహాల్లోనే ఉంటూ చదువుకుంటున్నారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అంతమంది ఉండటం లేదు. సగానికి సగం బోగస్ హాజరుతో బురిడీ కొట్టిస్తున్న పరిస్థితి మంత్రులు, అధికారుల పరిశీలనలోనే వెలుగుచూడటం గమనార్హం.

అక్రమాల విలువ కోట్లలోనే.. సంక్షేమ వసతిగృహాల్లో బోగస్ హాజరు వేసి ఆమేరకు అధికార యంత్రాంగం దండుకునేది రూ.కోట్లలోనే ఉంటుందని అంచనా. 7 నుంచి 10 తరగతులు చదివే పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు రూ.850, ఏడు లోపు చదివే పిల్లలకు ఒక్కొక్కరికి రూ.750 చొప్పున ప్రతి నెలా మెస్ ఛార్జీలు చెల్లిస్తుంది. ఈ ఛార్జీలతో పప్పులు, కూరగాయాలు, ఆయిల్ వంటివి మాత్రమే కొనుగోలు చేస్తారు. బియ్యాన్ని ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. ప్రభుత్వం చెల్లించే మెనూతో పిల్లలకు మంచి రుచికరమైన భోజనం పెట్టొచ్చని ప్రైవేటు మెస్ నిర్వాహకులు చెబుతున్నారు. బ్రాడీపేటలోని ఓ మెస్ నిర్వాహకుడు తన వద్దే విద్యార్థులకు వసతి చూపించి మూడు పూటలా ఆహారం పెట్టినందుకు కళాశాల విద్యార్థులకు నెలకు రూ.2 వేల నుంచి 2,500 ఛార్జీ చేస్తున్నారు. బ్రాడీపేట లాంటి చోట్ల భవనాలకు అద్దెలు చాలా ఎక్కువగా ఉంటాయి. డీలక్స్ వసతి గృహం కావాలనుకునే వారు రూ.3500 చెల్లించాలి. ప్రైవేటు మెస్‌లో భోజనంలో సాంబారు, రసం, పెరుగుతో పాటు మరో నాలుగైదు కూరలు, నిత్యం ఏదో ఒక స్వీటు ఇస్తారు. ఆపై మినరల్ వాటర్ సౌకర్యం ఉంటుంది. ఇంత తక్కువకే వారు అన్నిరకాల వంటకాలతో విద్యార్థులను బాగా ఆకట్టుకుంటున్నారు. ప్రభుత్వ వసతిగృహాల్లో ఇంత మెనూ నెలకు ఒక రోజు కూడా ఉండదు. నిత్యం పప్పు, సాంబారుతోనే సరిపుచ్చుతారు. ప్రభుత్వం ఉచిత వసతి, బియ్యం కూడా ఇస్తుంది. కాబట్టి సంక్షేమ వసతిగృహాల్లో చిన్నారులకు రూ.850తో మంచి రుచికరమైన భోజనం పెట్టవచ్చని ప్రైవేటు మెస్ నిర్వాహకులు అంటున్నారు. కానీ వసతిగృహాల్లో ఉండే పిల్లలకు పెడుతున్న అన్నం చూస్తే విరక్తికలగక మానదు. వసతిగృహాల్లో వారానికి రెండు, మూడు రోజులే గుడ్లు ఇస్తున్నారని, మిగిలిన రోజులు ఇవ్వకుండా ఆ మేరకు వార్డెన్లు తమ జేబులు నింపుకుంటున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఎంత ధైర్యం.. అడవులదీవి బీసీ బాలుర వసతిగృహంలో రెగ్యులర్ ఉద్యోగులు వంట, పనిమనిషి ఇద్దరు ఉన్నారు. కానీ వసతిగృహంలో వారికి బదులు అక్కడ ప్రైవేటు వంట మనిషి, కమాటీ ఉంటారు. వీరిద్దరికి ఒక్కొక్కరికి రూ.3,500 చొప్పున రెగ్యులర్ ఉద్యోగులు జీతం ఇచ్చి నియామకం చేసుకున్నారు. దీన్నిబట్టి వసతి గృహాల్లో ఉద్యోగుల తీరు ఎలా ఉందోఅర్థమౌతోంది. వసతిగృహంలో నిత్యం పిల్లలకు అందుబాటులో ఉంటూ స్థానికంగానే నివాసం ఉండాల్సిన వార్డెన్లు గుంటూరు తదితర పట్టణాల్లో నివాసం ఏర్పాటు చేసుకుని నెలకు నాలుగైదు రోజులు చుట్టపుచూపుగా విధులకు హాజరయ్యేవారు అనేక వసతిగృహాల్లో ఉన్నారనటంలో ఎలాంటి సందేహం లేదు.

బోగస్ హాజరుకు ఉదంతాలివీ..

- గత నెలలో గుంటూరు జిల్లా ఏసీబీ అధికారులు నిజాంపట్నం బీసీ బాలికల వసతిగృహానికి పరిశీలనకు ఉదయం 6 గంటలకు వెళ్లి రాత్రి 9 గంటల దాకా అక్కడే ఉన్నారు. ఆ గృహంలో వాస్తవంగా 134 ప్రవేశాలు ఉన్నట్లు చెబుతున్నా అధికారుల పరిశీలనలో మాత్రం ఉదయం, రాత్రి పూట భోజనం చేయటానికి వచ్చిన విద్యార్థులు కేవలం 24 మంది. అంటే 110 మందికి బోగస్ హాజరు చూపి అప్పటి దాకా నెలవారీ ఒక్కో పిల్లోడికి వెచ్చించే రూ.850 అధికారులు తమ జేబుల్లోకి మళ్లించుకున్నారు. రూ.850 చొప్పున 110 మందికి లెక్కిస్తే రూ.93 వేలు అవుతుంది.
- అడవులదీవి బాలుర వసతిగృహలో 108 మంది ప్రవేశాలు ఉంటే అక్కడ వాస్తవంగా 25 మందికి మించి ఉండటం లేదు. ఇక్కడా బోగస్ హాజరుతో నిధులు దండుకుంటున్నారు.
- పెదనందిపాడు వసతిగృహంలో ఏడాది కిందట ఏసీబీ అదికారులు పరిశీలనకు వెళ్లగా 75 మందికి 30 మంది ఉన్నారు.
- ప్రత్తిపాడు, రెంటచింతల ఎస్సీ గృహాల్లో కూడా 80 మంది పిల్లలు ఉన్నట్లు ప్రవేశాలు చూపగా పిల్లలు మాత్రం అధికారుల పరిశీలనలో 40 మంది తేలారు.
- కృష్ణాజిల్లా నందిగామలో ఎస్సీ బాలురు నెంబరు-1 గృహంలో 67 మంది ఉన్నట్లు హాజరు వేయగా ఏసీబీ పరిశీలనలో 55 మంది ఉన్నట్లు తేలింది.
- జి కొండూరు వసతిగృహంలో కూడా తక్కువ పిల్లలు ఉంటే ఎక్కువ మంది ఉన్నట్లు నిత్యావసరాలు డ్రా చేస్తున్నారు.

ఇంకేం లోపాలు ఉన్నాయంటే..

- అనేక వసతిగృహాల్లో కుళ్లిన కూరగాయలు వండి పెడుతున్నారు. నిజాంపట్నంలో కుళ్లిన కూరగాయలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- చాలా చోట్ల పిల్లలకు వార్డెన్ ఎవరు? వంట మనిషి, పని మనిషి సైతం తెలియకుండా ఉన్నారని ఏసీబీ పరిశీలనలో వెల్లడైంది.
- మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది.

సంచార లక్ష్య సాధన వాహనాలు ప్రారంభం

విజయవాడ సబ్‌కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇతర రాష్ట్రాలకు అనధికారకంగా ఇసుక అక్రమణ రవాణాను అరికట్టడానికి, ఇసుక అధిక ధరల నియంత్రణకు జిల్లాలో సంచార లక్ష్య సాధన (మొబైల్ టాస్క్‌ఫోర్సు) వాహనాలను ఏర్పాటు చేసి, అధికారుల బృందంతో పటిష్ఠ నిఘా పెట్టినట్లు కలెక్టరు బి.లక్ష్మీకాంతం తెలిపారు. సదరు సంచార వాహనంలో ఒక ఎస్.ఐ. స్థాయి పోలీసు అధికారి, ఉప తహసీల్దారు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు బృందంగా ఉంటారని పేర్కొన్నారు. నగరంలోని తమ విడిది కార్యాలయం వద్ద సంచార వాహాలను సోమవారం కలెక్టరు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఇసుక విధానం ప్రకారం సామాన్యులకు ఇసుకను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో ఇసుక అనధికారిక తవ్వకాలు, అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయాలపై పటిష్ఠ నిఘాను ఏర్పాటు చేశామన్నారు. ఇసుక అవసరమైన ప్రజలు నామమాత్రపు ధరకు పొందచ్చన్నారు. ఇసుక తవ్వకం, లోడింగు, రవాణా వంటి నామమాత్రపు ఛార్జీలను మీసేవా కేంద్రాల్లో చెల్లించి పొందవచ్చని చెప్పారు. రాష్ట్ర సరిహద్దుల్లోని జగ్గయ్యపేట మండలం దొండపాడు, గరికపాడు, వత్సవాయి మండలం పోలంపల్లి, తిరువూరు మండలం రాజుపేటల వద్ద నాలుగు సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, ఇతర రాష్ట్రాలకు ఇసుక అక్రమణ రవాణా నిరోధానికి గట్టి నిఘాను ఉంచామన్నారు. ఈకార్యక్రమంలో విజయవాడ ఆర్డీఓ ఎస్.హరీష్, గనుల శాఖ ఏడీ కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి సంచార లక్ష్య సాధన వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టరు లక్ష్మీకాంతం

గ్రామాల్లో నర్సరీలు..పశుగ్రాస క్షేత్రాలు

విజయవాడ సబ్‌కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ మొక్కల నర్సరీలు, పశుగ్రాస క్షేత్రాలను నెల కొల్పేలా చూడాలని కలెక్టరు బి.లక్ష్మీకాంతం సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం టెలీకాన్ఫరెన్సు నిర్వహించిన అనంతరం, కలెక్టరు నగరంలోని తమ విడిది కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో గ్రామ సమైక్య సంఘాల ద్వారా గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి, వాటిని సంరక్షించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. మొక్కలు నాటడడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా కృషి చేయాలన్నారు. పశుగ్రాస క్షేత్రాలకు అవసరమైన భూ సేకరణకు పశుసంవర్ధక శాఖ అధికారులకు తహసీల్దార్లు సహకరించాలని సూచించారు. నెలాఖరు నాటికి జిల్లాను బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా ప్రకటించేలా చూడాలని గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య మిషను అధికారులను ఆదేశించారు.

పొరుగు సేవల విధానంలో ఖాళీ ఉద్యోగాల భర్తీ.. జిల్లాలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను పొరుగు సేవలు విధానంలో భర్తీ చేయనున్నట్టు కలెక్టరు తెలిపారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లాలో మద్యం అనుబంధ దుకాణాలను లేకుండా చేశామని, ఎవరైనా అనధికారికంగా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరి నాట్లు విషయమై మాట్లాడుతూ ఈనెల 20 నాటికి నూరు శాతం నాట్లు పూర్తవ్వాలని వ్యవసాయాధికారులకు సూచించారు. వివిధ శాఖల పరిధిలో ఉన్న పెండింగు దస్త్రాలు, అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో డ్వామా, డీఆర్డీఏ, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు బి.రాజగోపాల్, డి.చంద్రశేఖరరాజు, వి.శరత్‌బాబు, వ్యవసాయ శాఖ జేడీ యు.నరసింహారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెదేపా నాయకుడికి చంద్రబాబు పరామర్శ

పటమట (విజయవాడ), న్యూస్‌టుడే: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెదేపా రాష్ట్ర పార్టీ వ్యవహారాల క్రియాశీలక సభ్యుడు, పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం బి.కొండేపాడుకు చెందిన మేకా వీరవెంకట సత్యవరప్రసాద్‌ను సీఎం చంద్రబాబు సోమవారం పరామర్శించారు. వరప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఐసీయూలో నిపుణుల పర్యవేక్షణలో అత్యుత్తమ వైద్యం అందిస్తున్నట్లు వైద్యులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. వరప్రసాద్ కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించి మాట్లాడారు. వైద్య పరంగా అన్ని విధాలా ఆదుకుంటానని చెప్పారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ సీహెచ్ రామానుజయ, వైద్యులు కోడూరు గోపాలకృష్ణ, వై.రమేష్‌బాబు, ఎల్‌వీఎస్ రాజశేఖర్, పీఎస్‌ఎస్ చౌదరి, కె.కిషోర్‌బాబు, కేఎల్‌వీ ప్రసాద్ ఉన్నారు.


వరప్రసాద్ ఆరోగ్యపరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు నాయుడు

జీవో నెంబరు 151 ప్రకారం వేతనాలు చెల్లించాలి

గాంధీనగర్ (విజయవాడ)న్యూస్‌టుడే: చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగులకు జీవో 151 ప్రకారం వేతనాలు చెల్లించాలని చికిత్సలను ప్రభుత్వమే నేరుగా నిర్వహించి ఇతర సమస్యలను పరిష్కరించాలని చంద్రన్న సంచార చికిత్స(104) ఒప్పంద ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రవిచంద్ర, జె.సింహాచలం డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడ అలంకార్ ధర్నా చౌక్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగులు గతంలో కలెక్టర్ పర్యవేక్షణలో పని చేసేవారని అనంతరం ప్రభుత్వం ప్రయివేటు సంస్థకు అప్పగించిదని అయితే హైకోర్టు ఆ సంస్థకు టెండర్లు రద్దు చేయాలని ఉత్తర్వులు ఇచ్చినట్లు గుర్తు చేశారు. జీవో ప్రకారం అన్ని క్యాడర్ల ఉద్యోగులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం శాశ్వత ఉద్యోగులతో సమానంగా జీతాలు చెల్లించాలని కోరారు. సంచార చికిత్స వాహనాలకు మందులు, ల్యాబ్ కెమికల్స్ సమకూర్చాలని, ప్రతి నెలా వాహనాలకు మరమ్మతు నిర్వహించాలని, మెరుగైన సేవల కోసం వాహనాల్లో ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌ని నియమించాలన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు వి.ఆర్.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుమారుడి ఆత్మహత్య

కాచిగూడ, న్యూస్‌టుడే: రైలు కిందపడి ఏపీలోని విజయవాడ పోలీస్ రవాణా సంస్థ (పీటీవో) హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ విజయ్‌లాల్ కథనం ప్రకారం... ఒంగోలుకు చెందిన అంకారావు విజయవాడలోని పోలీస్ రవాణా సంస్థలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతను తన భార్య, కుమారుడు లక్ష్మణ్ (25)లతో కలిసి నగరంలోని వనస్థలిపురంలో నివాసం ఉంటున్నాడు. లక్ష్మణ్ బీటెక్ పూర్తి చేశాడు. ఆదివారం సాయంత్రం స్నేహితుని గృహ ప్రవేశానికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికారు. అతని ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మలక్‌పేట-డబీర్‌పుర స్టేషన్ల మధ్య యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. మృతుడి వద్ద లభ్యమైన సెల్‌ఫోన్ ఆధారంగా అతన్ని హెడ్‌కానిస్టేబుల్ కుమారుడిగా గుర్తించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫైనల్స్‌లో ఇంజినీరింగ్, మెకానికల్ జట్లు



సెమీస్‌లో తలపడుతున్న మెకానికల్, ఎలక్ట్రికల్ జట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ద.మ.రైల్వే విజయవాడ డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నీలో సోమవారం మధ్యాహ్నం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో ఇంజినీరింగ్ జట్టు 25-21, 25-19తో డీఎల్‌ఎస్ జట్టుపై, మరో సెమీ ఫైనల్‌లో మెకానికల్ (సీ అండ్ డబ్ల్యు) జట్టు 25-18, 25-17తో ఎలక్ట్రికల్ (జీఎస్) జట్టుపై విజయం సాధించి ఫైనల్‌లో ప్రవేశించాయి. సోమవారం రాత్రి మూడోస్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఎలక్ట్రికల్ (జీఎస్) జట్టుపై 25-22, 20-25, 15-10 తో డీఎల్‌ఎస్ జట్టు విజయం సాధించింది. సోమవారం సీనియర్ డివిజనల్ ఇంజినీరు (కో-ఆర్డినేషన్) జీవీవీఎస్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని సెమీఫైనల్స్ మ్యాచ్‌లను ప్రారంభించారు.

దేశభక్తి కలిగి ఉంటే సత్వర అభివృద్ధి

సత్యనారాయణపురం (విజయవాడ), న్యూస్‌టుడే. జననీ, జన్మభూమిలకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతి ఉత్సవ సమితి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడలోని సత్యనారాయణపురం బీఆర్టీఎస్ రహదారిపై సోమవారం రాత్రి భారతమాత పూజాదినోత్సవం జరిగింది. నరసాపురం ఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ ప్రతివారిలోను దేశభక్తి ఉన్నపుడే సత్వర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకునే గతేడాది ప్రధాని నరేంద్రమోదీ తిరంగా రన్ పేరిట దేశంలో ప్రదర్శనలు నిర్వహించాలని కోరారన్నారు. అమరావతి ఉత్సవ సమితి అధ్యక్షులు ముత్తవరపు మురళీకృష్ణ మాట్లాడుతూ అంతరించిపోతున్న భారతీయ విలువలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, యువతలో దేశభక్తి పెంపొందించడం వంటి కార్యక్రమాల నిర్వహణ ప్రధాన ఉద్దేశ్యంగా ఈ సమితిని ప్రారంభించామన్నారు. పాత్రికేయులు ఎం.వి.ఆర్.శాస్త్రి స్వాతంత్ర్య సమరయోధులు బాలగంగాధర్‌తిలక్ స్మారకోపన్యాసం చేశారు. స్వాతంత్ర్యం నా జన్మహక్కు అని ఎలుగెత్తి చాటిన మొదటి భారతీయుడు తిలక్ అన్నారు. ప్రతి భారతీయుడు తిలక్‌ను ఆదర్శంగా తీసుకుంటే భారతదేశంవైపు శత్రువులు చూసేందుకు భయపడతారన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులను సత్కరించారు. కార్యక్రమంలో రామసాయి, హనుమంతరావు, భాజపా నగర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరాజు, లోకనాధశర్మ, తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న ముత్తవరపు మురళీకృష్ణ, హజరత్తయ్య గుప్తా, లాక వెంగళరావు యాదవ్, ఆశాకిరణ్ తదితరులు



భరతమాత చిత్రపటానికి పూజ చేస్తున్న ఎంపీ గోకరాజు గంగరాజు

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన..

నటుడు రచయిత దర్శకుడు పి.వి.ఎన్.కృష్ణ ఆధ్వర్యంలో ప్రదర్శించిన పృధ్వీరాజ్ చౌహాన్ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముందు జరిగిన కాగడాల ప్రదర్శనలో ముత్తవరపు మురళీకృష్ణ, న్యాయవాది హాజరత్తయ్యగుప్తా, లాకా వెంగళరావు యాదవ్,ఆశాకిరణ్, భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

డీసీపీ కాంతిరాణా టాటాకు పదోన్నతి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: విజయవాడ శాంతిభద్రతల విభాగం డీసీపీ-2 కాంతిరాణాటాటా సీనియర్ ఐపీఎస్ అధికారిగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా విజయవాడ పోలీస్ కమిషనర్ డి.గౌతం సవాంగ్ పదోన్నతి పొందిన కాంతిరాణాటాటాకు కాలర్ క్యాప్స్ అమర్చి అభినందించారు.



కాంతిరాణాటాటాకు కాలర్ క్యాప్స్ అమరుస్తున్న సీపీ గౌతం సవాంగ్

ముగిసిన పవిత్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఏడాది కాలంలో దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఎదురయ్యే స్పృశ్యత, అస్పృశ్యత దోష నివారణార్థం ఈనెల 12న ప్రారంభించిన పవిత్రోత్సవాలు పూర్ణాహుతితో సోమవారం ముగిశాయి. దుర్గమ్మ ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాల్లోని ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ రుత్వికులు ఏర్పాటు చేసిన పవిత్రాలను దేవస్థానంలోని సిబ్బంది, భక్తులకు పంపిణీ చేశారు. ఉత్సవమూర్తులకు అలంకరించిన పవిత్రాలను ధరిస్తే ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని భక్తుల విశ్వాసం. పూజ ద్రవ్యాలు ఉంచిన పట్టుచీరను హోమగుండంలో అగ్నిదేవునికి సమర్పించడంతో పూర్ణాహుతి కార్యక్రమం ముగిసింది. మహా మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో పాలకమండలి ఛైర్మన్ యలమంచిలి గౌరంగబాబు, ఈవో సూర్యకుమారి, పాలకమండలి సభ్యులు జి. పద్మశేఖర్, బి. ధర్మారావు, సీహెచ్ సాంబసుశీల పాల్గొన్నారు.



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న పాలకమండలి ఛైర్మన్ గౌరంగబాబు, సభ్యులు, ఈవో సూర్యకుమారి

కార్పొరేషన్ కబుర్లు

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు మేయర్ కోనేరు శ్రీధర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.

- విజయవాడ కార్పొరేషన్, న్యూస్‌టుడే

సమాచార వాహిని

మార్గదర్శి గవర్నరుపేట శాఖలో చిట్ గ్రూపుల వివరాలివి

విజయవాడ : మార్గదర్శి చిట్‌ఫండ్, అమ్మన్న ఎస్టేట్స్, మ్యూజియం రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ-2 శాఖలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న చిట్‌గ్రూపుల వివరాలు ఇలా ఉన్నాయి. అదనపు సమాచారం కొరకు K.కృష్ణమోహన్, సీనియర్ బ్రాంచి మేనేజర్‌ను సంప్రదించవచ్చు.

ఫోన్ నెంబర్లు : 0866-2433270, 2432870, 2435270, 2435280

సెల్ నెంబరు : 80082 23481

క్రమ సంఖ్య	నెలసరి వాయిదా	నెలలు	చిట్ విలువ
1.	1,00,000	50	50,00,000
2.	1,00,000	40	40,00,000
3.	1,00,000	30	30,00,000
4.	75,000	40	30,00,000
5.	50,000	50	25,00,000
6.	50,000	40	20,00,000
7.	20,000	50	10,00,000
8.	25,000	40	10,00,000
9.	40,000	25	10,00,000
10.	30,000	30	9,00,000
11.	15,000	40	6,00,000
12.	20,000	25	5,00,000
13.	12,500	40	5,00,000
14.	10,000	50	5,00,000
15.	10,000	30	3,00,000
16.	6,000	50	3,00,000
17.	10,000	25	2,50,000
18.	5,000	40	2,00,000
19.	4,000	25	1,00,000
20.	2,500	40	1,00,000
21.	1,250	40	50,000


వేకెంట్ చిట్‌లు కావలసినవారు బ్రాంచి మేనేజరును సంప్రదించగలరు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమావేశానికి హాజరైన పూర్వవిద్యార్థులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఒరేయ్ బాగున్నావా ... నీలో ఎంత మార్పు వచ్చింది... నిన్ను చూసి ఏన్నేళ్లయ్యిందో అంటూ పలకరింపులు, ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందం చెందతూ. . అప్యాయత, అనుబంధంతో వేడుకలకు వేదికగా మారింది ఎంజీ రోడ్డులోని ఫార్చ్యూన్ మురళీపార్కు. గాంధీనగర్‌లోని శ్రీనివాస బాలవిద్యాలయం పబ్లిక్ పాఠశాలలో 1988-89 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. వీరంతా ప్రస్తుతం నగరంతో పాటు వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ స్థిరపడ్డారు. వేదికపై ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. కుటుంబసభ్యులు కూడా వీరికి తోడుగా వచ్చి ఆనంద వేడుకల్లో మునిగి తేలారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అప్యాయతలు, అనుబంధాలు పంచుకున్నారు. కలిసి భోజనం చేశారు. పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎంవీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ సంఘం తరపున సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి కుమారుడు కౌశల్ వివాహం సిటీకేబుల్ ఎండీ పొట్లూరి సాయిబాబు కుమార్తె మేఘనతో ఈ నెల 11న విజయవాడలో జరిగింది. సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం సాయంత్రం ఆర్టీసీ కాలనీలోని పొట్లూరి సాయిబాబు ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

- పటమట (విజయవాడ), న్యూస్‌టుడే

సమష్టితత్వంతోనే పథకాల సక్రమ అమలు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పింఛనుదారులందరూ సమష్టిగా ఉంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరుగుతాయని ఆలిండియా బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్ల వెల్‌ఫేర్ అసోసియేషన్ సర్కిల్ కార్యదర్శి (తెలంగాణ) కె.ఎస్.కోటేశ్వరరావు అన్నారు. సోమవారం సిద్ధార్థ ఆడిటోరియంలో ఆలిండియా బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్ల వెల్‌ఫేర్ అసోసియేషన్ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క పింఛనుదారుడు కచ్చితంగా సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. సర్కిల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఆర్‌ఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ అసోసియేషన్ కార్యకలాపాలతో పాటు జరుగుతున్న కార్యక్రమాలు, సాధించిన విజయాలను వివరించారు. సర్కిల్ చీఫ్ ఎడ్వయిజర్ బి.కొండయ్య, కార్యదర్శి వి.వరప్రసాద్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌ఆర్‌కే మూర్తి, డివిజనల్ కార్యదర్శి ఎన్ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ఎన్నిక అనంతరం 80 ఏళ్లు నిండిన ముగ్గురు, 75 ఏళ్లు నిండిన 24 మంది సీనియర్ సిటిజన్లను సత్కరించారు.



సీనియర్ సిటిజన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నగరంలో పోలీసుల విస్తృత తనిఖీలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ముందస్తు భద్రతాచర్యల్లో భాగంగా నగరంలోని హోటళ్లు, లాడ్జిల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్ ఆదేశాల మేరకు శాంతిభద్రతల విభాగం, టాస్క్‌ఫోర్స్ పోలీసులు నగరంలో ఏకకాలంలో ఆదివారం, సోమవారం రాత్రి తనిఖీలు చేశారు. గవర్నర్‌పేట, గాంధీనగర్, రైల్వేస్టేషన్, బస్టేషన్లలోని హోటళ్లను సైతం తనిఖీలు చేసి ఆయా రికార్డులను పరిశీలించారు. ఇతర రాష్ట్రాల వారి వివరాలను తెలుసుకుని వారు వచ్చిన పని విషయాలను తెలుసుకున్నారు. నగరంలోని ముఖ్యమైన కూడళ్లులో పోలీసు పికెట్లు ఏర్పాట్లు చేశారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆగస్టు 8: రాష్ట్రీయం

తెలుగు రాష్ట్రాల మధ్య బదిలీలకు అనుమతి

♦ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అంతర్రాష్ట్ర బదిలీలకు అనుమతినిస్తూ, దీనికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేశాయి. భార్యాభర్తల బదిలీలు, స్థానిక (జిల్లా, జోనల్, బహుళ జోనల్), కేంద్రం ఆమోదం పొందిన రాష్ట్ర స్థాయి కేటగిరీల్లో పరస్పర బదిలీలకు అనుమతి లభించింది. ప్రభుత్వ శాఖలతో పాటు స్థానిక సంస్థల ఉద్యోగులకు కూడా ఇవి వర్తిస్తాయి. తెలుగు రాష్ట్రాల విభజన సందర్భంగా కమలనాథన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగుల విభజన జరిగింది. 58, 42 శాతం దామాషాలో కేటాయింపులు జరిపారు. వివిధ కారణాలతో చాలామంది ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీలను కోరారు. దీనిపై గవర్నర్ నరసింహన్ నేతృత్వంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. ఇద్దరు సీఎంలు అంతర్రాష్ట్ర బదిలీలకు ఆమోదం తెలిపారు.

ప్రతిభ

‘సంకల్పం నుంచి సిద్ధి వరకు’ నినాదం ఎవరిది?

కరెంట్ అఫైర్స్

జాతీయం

ఆగస్టు 4

నావిక్‌కు భారత పరమాణు గడియారాలు

♦ సొంత జీపీఎస్ వ్యవస్థ (నావిక్)లో స్వదేశీకరణ దిశగా భారత్ కీలక ముందడుగు వేసింది. నావిక్‌కు భారత పరమాణు గడియారాల ద్వారానే సమయాన్ని అందించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన ఇస్ట్రాక్‌సెల్, దిల్లీలోని నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీ (ఎన్‌పీఎల్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఇస్రోకు అత్యంత కచ్చితమైన సమయాన్ని ఎన్‌పీఎల్ అందిస్తుంది. ఇది అందించే భారత ప్రామాణిక సమయానికి (ఐఎస్‌టీ) అనుగుణంగా 'నావిక్' సమన్వయమవుతుంది.

ఆగస్టు 7

అగర్తలాలో ఎల్పీజీ బాట్లింగ్ కర్మాగారం



♦ రూ.143 కోట్లతో అగర్తలాలో నిర్మించనున్న ఎల్‌పీజీ బాట్లింగ్ కర్మాగారానికి కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శంకుస్థాపన చేశారు. ఈశాన్య రాష్ట్రాలకు ఎదురవుతున్న వంట గ్యాస్ కొరతను అధిగమించడానికి చిట్టగాంగ్ నుంచి త్రిపుర వరకు సహజ వాయువు గొట్టపు మార్గాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. పశ్చిమ్ బంగలోని సిలిగురి నుంచి బంగ్లాదేశ్‌లోని పార్వతీపూర్ వరకు డీజిల్ చేరవేయడానికి గొట్టపు మార్గాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. గృహావసరాల కోసం పేదలు వినియోగించే కిరోసిన్, వంటగ్యాస్ సిలిండర్లపై రాయితీ కొనసాగుతుందని ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు.

ఆగస్టు 8

అయోధ్యకు పరిష్కారం

♦ అయోధ్యలో వివాదాస్పద స్థలానికి సముచిత దూరంలో ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతంలో మసీదును నిరభ్యంతరంగా నిర్మించుకోవచ్చంటూ ఉత్తర్ ప్రదేశ్ షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డు సుప్రీంకోర్టుకు తన అభిప్రాయాన్ని సూచనప్రాయంగా తెలిపింది. ఈ వ్యవహారంలో వివిధ హిందూ సంస్థలు చేస్తోన్న డిమాండ్‌కు మద్దతుగా ముందుకొచ్చిన తొలి ముస్లిం సంస్థ యూపీ షియా బోర్డే అవుతుంది. అయితే అదే సమయంలో బాబ్రీ మసీదు స్థలం తమ సొంత ఆస్తి అని, ఈ వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారానికి చర్చలు జరిపే హక్కు తమకు మాత్రమే ఉందని కూడా వక్ఫ్‌బోర్డు స్పష్టం చేసింది.

ఆగస్టు 9

క్విట్ ఇండియా ఉద్యమ 75వ వార్షికోత్సవం

♦ క్విట్ ఇండియా దినోత్సవ 75 వ వార్షికోత్సవాన్ని దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'సంకల్పం నుంచి సిద్ధి వరకు' అనే నినాదాన్ని ఇచ్చారు. పీడిస్తోన్న సమస్యల నుంచి దేశానికి విముక్తి కల్పించి, 2022 నాటికి సరికొత్త భారతావనిని తీర్చిదిద్దడానికి ప్రజలు ప్రతిజ్ఞ తీసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రూపొందించిన ఎనిమిది తపాలా బిళ్లలను రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఎట్‌హోం కార్యక్రమంలో విడుదల చేశారు.

గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు

♦ గుజరాత్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. భాజపా నుంచి బరిలో దిగిన జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సునాయాసంగా గెలుపొందగా, మూడో అభ్యర్థి బల్వంత్ సింగ్ రాజ్‌పుత్ మాత్రం ఓటమి పాలయ్యారు. సోనియా గాంధీ రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్ వెంట్రుకవాసిలో ఓటమిని తప్పించుకుని విజయం సాధించారు. గెలవడానికి అవసరమైన 44 ఓట్లను దక్కించుకున్న పటేల్ ఐదోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

ఆగస్టు 10

హమీద్ అన్సారీ పదవీ విరమణ

♦ రెండు విడతల్లో పదేళ్లపాటు రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి హోదాల్లో సేవలందించిన మహ్మద్ హమీద్ అన్సారీ పదవీ కాలం పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో ఆయనకు రాజ్యసభ ఘనంగా వీడ్కోలు పలికింది.

పెరగనున్న కేంద్ర ప్రభుత్వ వ్యయం

♦ కేంద్ర ప్రభుత్వ వ్యయం 2019-20 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.26 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని పార్లమెంటుకు సమర్పించిన ఆర్థికశాఖ అధికార పత్రం వెల్లడించింది. మూలధన వ్యయం 25% పెరిగి, ఆ ఆర్థిక సంవత్సరం నాటికి రూ.3.9 లక్షల కోట్లకు చేరుతుందని, ఒక్క రక్షణ రంగ వ్యయమే 22% పెరుగుతుందని ఈ నివేదిక పేర్కొంది. రెవెన్యూ వ్యయంతో కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖర్చు రూ.21.46 లక్షల కోట్లుగా, వచ్చే ఏడాది రూ. 23.4 లక్షల కోట్లుగా ఉంటుందని తెలిపింది.

ఆగస్టు 11

వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకారం

♦ దేశ 15 వ ఉపరాష్ట్రపతిగా (వ్యక్తుల పరంగా 13) తెలుగుబిడ్డ ముప్పవరపు వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాల్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. వెంకయ్య భగవంతుడి పేరిట ప్రమాణం చేశారు.

♦ ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రాజ్యసభ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంకయ్య నాయుడు రాజ్యసభ కార్యకలాపాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులనుద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.

అంతర్జాతీయం

ఆగస్టు 6

ఉత్తర కొరియాపై ఆంక్షలు

♦ ఉత్తర కొరియాపై కఠిన ఆంక్షలను విధిస్తూ అమెరికా రూపొందించిన ఒక తీర్మానానికి ఐరాస భద్రతా మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీనివల్ల ఉత్తర కొరియాకు ఏటా 100 కోట్ల డాలర్ల మేర ఆదాయాన్నిచ్చే ఎగుమతులపై నిషేధం అమలవుతుంది. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా చేపట్టిన మొదటి చర్య ఇదే. దీనికి ఉత్తర కొరియా మిత్రపక్షం చైనా కూడా మద్దతు తెలపడం విశేషం.

ఆగస్టు 7

♦ వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలో చైనా కృత్రిమ దీవులను ఏర్పాటు చేయడం, వాటిపై నిర్మాణాలు చేపట్టడం, సైనికీకరణను అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా ఖండించాయి. మనీలాలో జరిగిన ఆసియాన్ విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా కొన్ని ఆసియాన్ దేశాలు దక్షిణ చైనా సముద్ర వివాదం విషయంలో చర్చలపై చైనా విధి విధానాలకు అంగీకారం తెలిపాయి. ఇలా చైనా పట్ల ఆసియాన్ వైఖరి మెత్తబడిన తరుణంలో ఈ మూడు దేశాలు ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

ఆగస్టు 9

వీసా రహిత ప్రవేశాన్ని ప్రకటించిన ఖతార్

♦ భారత్‌తో సహా 80 దేశాల ప్రజలకు వీసా రహిత ప్రవేశానికి అనుమతి ఇస్తున్నట్లు ఖతార్ ప్రకటించింది. ఈ 80 దేశాల ప్రజలు ఖతార్ చేరుకున్న వెంటనే అక్కడికక్కడే పర్యటక వీసాలను మంజూరు చేస్తారు.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 5

నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా రాజీవ్ కుమార్



♦ నీతి ఆయోగ్ తదుపరి వైస్ ఛైర్మన్‌గా డాక్టర్ రాజీవ్ కుమార్‌ను నియమిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆక్స్‌ఫర్డ్‌లో ఆర్థిక శాస్త్రంలో డీఫిల్, లఖ్‌నవూ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేసిన రాజీవ్ కేంద్ర విధానాల పరిశోధన సంస్థలో సీనియర్ ఫెలోగా ఉన్నారు. గతంలో ఫిక్కీకి సెక్రటరీ జనరల్‌గా, భారతీయ అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల పరిశోధన మండలికి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు.

ఆగస్టు 8

ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా



♦ సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా నియమితులయ్యారు. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ ఈనెల 27 న పదవీ విరమణ చేస్తోన్న నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. దీపక్ 1977 లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 1996 లో ఒడిశా హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1997 లో మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2009 లో పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2010 లో దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2011 లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 8

వయోపరిమితికి మరో రెండేళ్లు..

♦ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర నియామక సంస్థల ద్వారా భర్తీ అయ్యే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల గరిష్ఠ వయో పరిమితి పెంపుదలను మరో రెండేళ్లు అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణ నియామకాలకు మాత్రమే పెంపుదల వర్తిస్తుందని, పోలీసు, అబ్కారీ, అటవీ, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లాంటి యూనిఫాం సర్వీసులకు వర్తించదని పేర్కొంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత నిరుద్యోగుల వినతి మేరకు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 34 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచుతూ 2017 జులై 27 న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ గడువు 2017 జులై 26 తో ముగిసిపోయింది. తాజాగా దీన్ని మరో రెండేళ్లపాటు అంటే 2019 జులై 26 వరకు అమలు చేసేందుకు ఆదేశాలిచ్చింది.

ఆగస్టు 10

ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి శంకుస్థాపన

♦ ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి సంబంధించిన వరద కాలువ వద్ద ఏర్పాటు చేసిన పైలాన్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. అనంతరం పోచంపాడు వద్ద గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. మేడిగడ్డ నుంచి తరలించే జలాలతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. ప్రధాన గోదావరిలో ఎగువ రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి చుక్కనీరు రాకపోయినా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కాలువలు నిత్యం జలకళతో ఉట్టిపడేలా రూ.2 వేల కోట్లతో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

♦ విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీకి (ఐఐపీఈ) జాతీయ ప్రాధాన్యత హోదా కల్పిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని 13 వ షెడ్యూల్‌లో పేర్కొన్న హామీ ప్రకారం కేంద్ర ప్రభుత్వం గతేడాది విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఐఐపీఈని ప్రారంభించింది. మిగతా జాతీయ విద్యా సంస్థల్లాగే డిగ్రీలు ప్రదానం చేసే స్వయం ప్రతిపత్తి కల్పించడానికి ఈ బిల్లును ఉద్దేశించారు.

ఆగస్టు 6

చిత్తూరు జిల్లాలో ఈ - క్లస్టర్

♦ చిత్తూరు జిల్లాలో 501 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీ క్లస్టర్ (ఈ-క్లస్టర్)కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ తుది అనుమతులు జారీచేసింది.

ఆగస్టు 8

విజయవాడలో విద్యుత్‌సౌధ ప్రారంభం

♦ విజయవాడలోని గుణదలలో నిర్మించిన విద్యుత్ సౌధ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఏపీఎస్ఎల్‌డీసీ)ను సీఎం చంద్రబాబుతో కలిసి గవర్నర్ నరసింహన్ ప్రారంభించారు. సంతోషానికి చిహ్నంగా ఈ భవనాలకు 'సమృద్ధి' అనే పేరు పెట్టాలని గవర్నర్ సూచించారు.

ఆగస్టు 9

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

♦ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అరకులో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, గవర్నర్ నరసింహన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో 34 తెగల్లో 27.39 లక్షల మంది గిరిజనులు ఉన్నారు. వీరి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.3,520 కోట్లు కేటాయించినట్లు సీఎం తెలిపారు.



రచయిత

- సీహెచ్. కృష్ణప్రసాద్

విషయ నిపుణులు